

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -163 | పేజీలు - 8 | వెల ₹03/- | ఆదివారం 20 సెప్టెంబర్ 2026

విశాఖలో పేదలకు
పట్టాభిషేకం

28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు పంపిణీ




మీ ఇంటిపై సర్వ హక్కులు మీవేనని సీఎం చంద్రబాబు భరోసా

విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని భారీ ప్రకటన

గోదావరి జలాలతో నగర నీటి కష్టాలు శాశ్వతంగా తీరుస్తామని హామీ

గత ప్రభుత్వ పాలనలో భూ కబ్జాలు, కూల్చివేతలపై తీవ్ర విమర్శలు



విశాఖపట్నం సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)
విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల కల నెరవేరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం ద్వారా 28,445 కుటుంబాలకు వారు నివసిస్తున్న ఇళ్లపై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. శనివారం విశాఖలో జరిగిన సభలో ఆయన లబ్ధిదారులకు కన్వీనియన్స్ డీడ్స్ అందజేశారు. ఈ నిర్ణయంతో వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపామని అన్నారు. వేలాది కుటుంబాల దశాబ్దాల కల సాకారమైన వేళ వారి ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందాన్ని చూసి, "మీ ముఖాల్లో ఈ ఆనందం చూస్తే నా జీవితం ధన్యమైంది. నా ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను" అంటూ చంద్రబాబు భావోద్వేగంతో ప్రసంగించారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, పేద ప్రజల ఆత్మగౌరవానికి, వారి పిల్లల భవిష్యత్తుకు చేస్తున్న పట్టాభిషేకం అని ఆయన అభివర్ణించారు. **మిగతా 2లో...**

భారత యువత సత్తాకు
స్టార్టప్‌లే నిదర్శనం

- **20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ**
- **భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరణ**
- **చిన్న నగరాల్లోనూ స్టార్టప్‌లు వస్తుండటం శుభపరిణామం అన్న ప్రధాని**
- **రూ. లక్ష కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభం**
- **కొత్తగా చేరిన ఉద్యోగులకు నిరంతర అభ్యాసంపై ప్రధాని మోదీ సూచన**

ఢిల్లీ సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)
దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు.

20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు **మిగతా 2లో...**



తిరుమలలో వైభవంగా
గరుడ సేవ..

- **రెండు లక్షల మంది భక్తులతో పోటెత్తిన మాఢవీధులు**
- **శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైనది గరుడ సేవ**
- **గరుడ వాహనంపై భక్తులను కటాక్షించిన మలయప్ప స్వామి**
- **లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు**
- **గోవింద నామస్మరణలతో మార్మోగిన తిరుమల కొండ**
- **భక్తుల కోసం టీటీడీ భారీ ఏర్పాట్లు, నిరంతర పర్యవేక్షణ**



తిరుమల సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)
తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన గరుడ వాహన సేవ శనివారం రాత్రి అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. గరుత్మంతునిపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీ మలయప్పస్వామి వారు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ లక్షలాది మంది భక్తులకు అభయమిచ్చారు. ఈ అపురూప దృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు తరలివచ్చిన**మిగతా 2లో...**

అనర్హత తీర్పుపై.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం



ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. బీఆర్ఎస్ తరపున గెలిచి, **మిగతా 2లో...**

కొత్త రూల్‌పై గందరగోళం

- **యూపీఐ చెల్లింపులపై కొత్త ఛార్జీలు.. నిరసనకు దిగిన వ్యాపారులు..**
- **రూ.2000 దాటిన యూపీఐ లావాదేవీలపై కొత్త ఛార్జీల ప్రతిపాదన**
- **నిరసనగా యూపీఐ చెల్లింపులు నిలిపివేస్తామంటున్న వ్యాపారులు**
- **అక్టోబర్ 15 నుంచి నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆందోళన**
- **ఈ ఛార్జీ వ్యాపారులకే తప్ప, వినియోగదారులకు కాదంటున్న ప్రభుత్వం**
- **95 శాతం లావాదేవీలపై ప్రభావం ఉండదని స్పష్టీకరణ**





భారతీయులకు పెరిగిన
వీసా టెన్షన్

- **అమెరికా యూనివర్సిటీలకు విదేశీ విద్యార్థుల దెబ్బ..**
- **వీసా జాప్యం, తిరస్కరణలే ప్రధాన కారణాలు**
- **63 శాతం యూనివర్సిటీ అధికారుల్లో ఇమ్మిగ్రేషన్‌పై ఆందోళన**
- **విదేశీ విద్యార్థులు తగ్గడంతో 73 శాతం సంస్థల ఆదాయంతో తగ్గుదల**
- **భారతీయ విద్యార్థులకు కీలకంగా మారిన వీసా పరిస్థితులు**

ఢిల్లీ సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)
అమెరికాలో ఉన్నత విద్య చదవాలనుకునే విదేశీ విద్యార్థులకు పరిస్థితులు ఏమంత ఆశాజనకంగా కనిపించడం లేదు. 2026 విద్యా సంవత్సరానికి అమెరికాలోని సగానికి పైగా కాలేజీలు, యూనివర్సిటీలకు విదేశీ విద్యార్థుల**మిగతా 2లో...**

అక్టోబర్ 1న కరవు మండలాలను
ప్రకటించండి

: సీఎం చంద్రబాబు ఆదేశాలు

- **రాష్ట్రవ్యాప్తంగా 513 మండలాల్లో కరవు ఛాయలు ఉన్నట్టు ప్రాథమిక అంచనా**
- **పంట నష్టాన్ని నివారించి, సూక్ష్మ సేద్యం, ప్రకృతి సాగును ప్రోత్సహించాలని సూచన**



అమరావతి సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)
రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేసి, అక్టోబర్ 1న కరవు మండలాలను అధికారికంగా ప్రకటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎక్కడా పంట నష్టం జరగకుండా, తాగునీటి **మిగతా 2లో...**

స్థానిక ఎన్నికల్లో
కూటమిదే విజయం

100 శాతం స్ట్రైక్ రేట్ ఖాయం: నాదెండ్ల మనోహర్

కచ్చితంగా విజయం సాధించే స్థానాల్లో పోటీ చేయడమే ముఖ్యమని వ్యాఖ్య

పవన్ కల్యాణ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నారని వెల్లడి

విశాఖపట్నం సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగిస్తుందని, వందకు వంద శాతం స్ట్రైక్ రేట్‌తో విజయాలు సాధిస్తామని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ధీమా వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో పర్యటించిన ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై మాట్లాడారు. అభ్యర్థుల ఎంపికలో ఏవైనా పొరపాట్లు లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, స్థానిక వార్డుల వారీగా బలమైన**మిగతా 2లో...**



జపాన్‌లో20వ ఆసియా క్రీడలు
ఘనంగా ప్రారంభం

- **భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ**
- **ప్రారంభోత్సవంలో పతాకధారులుగా షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్**
- **గత ప్రదర్శనను అధిగమించి మరిన్ని పతకాలు గెలవాలనే లక్ష్యంతో భారత్**
- **క్రికెట్, కబడ్డీ, హాకీలో టైటిళ్లను నిలబెట్టుకోవాలని చూస్తున్న టీమిండియా**



ఢిల్లీ సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)
ఆసియా ఖండంలోనే అతిపెద్ద క్రీడా సంబరం మొదలైంది. జపాన్‌లోని ఐచీ-నగోయా నగరాలు వేదికగా 20వ ఆసియా క్రీడలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన అట్టహాస వేడుకలో జపాన్ చక్రవర్తి నరుహిటో ఈ క్రీడలను అధికారికంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. రాబోయే రెండు వారాల పాటు వేలాది మంది క్రీడాకారులు పతకాల**మిగతా 2లో...**

తిరుమలలో వైభవంగా గరుడ సేవ..

మొదటిపేజీ తరువాయి

భక్తుల "గోవిందా.. గోవిందా.." నామస్మరణలతో సప్తగిరులు మార్మోగాయి.శనివారం సాయంత్రం 6:30 గంటలకు వాహన మండపం నుంచి గరుడ వాహనంపై స్వామివారు బయటకు రాగానే, మాడ వీధుల్లోని గ్యాలరీలలో వేచి ఉన్న భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గజరాజులు ముందు నడుస్తుండగా, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల ఘోష్టి, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు.గరుడ సేవను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. మాడ వీధుల్లోని 1.90 లక్షల మంది సామర్థ్యం గల గ్యాలరీలు శుక్రవారం రాత్రికే భక్తులతో కిక్కిరిసిపోయాయి. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ శనివారం ఉదయం నుంచే పాలు, అన్నప్రసాదాలు,



తాగునీరు, అల్పాహారం వంటివి నిరంతరాయంగా అందించింది. సుమారు 2000 మంది శ్రీవారి సేవకులు ఈ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సేవలందించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి స్వయంగా మాడ వీధుల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జేఈవోలు శరత్, గోపీనాథ్ శిలాతోరణం వద్ద క్యూలైన్లలోని భక్తులకు అందుతున్న అన్నప్రసాదం, నీటి సరఫరాను పరిశీలించారు. సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. సుమారు 600 మంది టీటీడీ ఉద్యోగులు తిరుమలలోని 8 కీలక ప్రాంతాల్లో సెక్టోరల్ అధికారులుగా విధులు నిర్వర్తించారు.

వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు విశిష్ట ప్రాధాన్యం ఉంది. జ్ఞాన, వైరాగ్యాలకు ప్రతీక అయిన గరుత్మంతునిపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పలువురు టీటీడీ బోర్డు సభ్యులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అర్ధాంగి వసుంధర దేవి కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

కొత్త రూలుపై గందరగోళం

యూపీఐ చెల్లింపులపై కొత్త ఛార్జీలు.. నిరసనకు దిగిన వ్యాపారులు..

ఢిల్లీ సెప్టెంబర్ 19 (ఏపబ్లిక్ న్యూస్)

దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి కారణమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కొత్తగా ఛార్జీలు విధించాలన్న ప్రతిపాదన వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తోంది. ఘజియాబాద్‌లోని పలువురు వ్యాపారులు దీనికి నిరసనగా తమ దుకాణాల ముందు 'యూపీఐ చెల్లింపులు స్వీకరించబడవు' అంటూ నోటీసులు అంటిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు పైబడిన ఎంపిక చేసిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న నిర్ణయమే ఈ ఆందోళనకు కారణం.

వ్యాపారులు ఈ అదనపు భారాన్ని మోయడానికి సిద్ధంగా లేరు. ఈ ఛార్జీలను ప్రభుత్వం వ్యాపారుల నుంచే వసూలు చేస్తుందని చెప్పినప్పటికీ, ఇది పరోక్షంగా వినియోగదారులపైనే ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే, అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన కొనుగోళ్లకు నగదు తీసుకురావాలని వినియోగదారులకు సూచిస్తున్నారు. ఈ కొత్త ఛార్జీల భారాన్ని తాము భరించలేమని, అందుకే పెద్ద మొత్తంలో చెల్లింపులకు నగదు అడగాల్సి వస్తుందని వారు చెబుతున్నారు.

అక్టోబర్ 15 నుంచి ఏం మారుతుంది?

కొత్త నిబంధనల ప్రకారం.. అక్టోబర్ 15 నుంచి



వినియోగదారుడి నుంచి వ్యాపారికి (పర్సన్-టు-మర్చంట్) చేసే రూ.2,000కు పైబడిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. ఈ ఛార్జీని కస్టమర్ కాకుండా, సదరు వ్యాపారి చెల్లించాల్సి ఉంటుంది. లావాదేవీ విలువ రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, ఈ ఛార్జీ గరిష్టంగా రూ.300గా పరిమితం చేశారు.

అయితే, వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ చెల్లింపులు, అలాగే రూ.2,000 లోపు చేసే వ్యాపార చెల్లింపులపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. ప్రస్తుతం జరుగుతున్న 'పర్సన్-టు-మర్చంట్' (పీ2ఎం) లావాదేవీలలో 95 శాతానికి పైగా రూ.2,000 లోపువే కాబట్టి, వాటిపై ఈ కొత్త నిబంధన ప్రభావం ఉండదు. అంటే, దుకాణంలో రూ.1,500 వస్తువును యూపీఐ ద్వారా కొంటే ఎలాంటి అదనపు రుసుము ఉండదు. అధిక విలువైన లావాదేవీలకే ఈ మార్పు వర్తిస్తుంది.

ప్రభుత్వం ఏమంటోంది?

ఈ ఛార్జీల భారాన్ని పూర్తిగా వ్యాపారులే భరించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఒకవేళ వ్యాపారులు బిల్లులపై 'యూపీఐ ఛార్జీ' అని ప్రత్యేకంగా వేయడం ప్రారంభిస్తే, యూపీఐ ఇక ఉచితం కాదనే భావన ప్రజల్లోకి వెళ్తుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఇది డిజిటల్ చెల్లింపుల స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. అందుకే, ఈ భారం వినియోగదారులపై పడకుండా చూసేందుకు పేమెంట్ అగ్రిగేటర్లు, బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది.

ప్రజలు తిరిగి నగదు వైపు వెళ్తారా?

ఈ కొత్త ఛార్జీల వల్ల ప్రజలు మళ్లీ నగదు వాడకం వైపు మళ్లుతారని ప్రభుత్వం భావించడం లేదు. మొత్తం యూపీఐ లావాదేవీల పరిమాణంలో కేవలం 4 శాతం మాత్రమే ఈ కొత్త లెవీ పరిధిలోకి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్‌పీసీఐ గణాంకాల ప్రకారం, ఆగస్టు నెలలో జరిగిన పీ2ఎం యూపీఐ లావాదేవీల్లో 86 శాతం రూ.500 లోపువే కాగా, మరో 10 శాతం రూ.501 నుంచి రూ.2,000 మధ్య ఉన్నాయి.

కాబట్టి సామాన్య ప్రజల రోజువారీ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదు. మరోవైపు, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై లావాదేవీ విలువతో సంబంధం లేకుండా ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టం చేశారు. ఇది వ్యాపారులకు, వినియోగదారులకు మరో డిజిటల్ చెల్లింపు మార్గంగా అందుబాటులో ఉంటుంది.

విశాఖలో పేదలకు పట్టాభిషేకం

మొదటిపేజీ తరువాయి

దశాబ్దాల నిరీక్షణకు తెర.. సర్వ హక్కులు మీవే!

"కూడు, గూడు, గుడ్డ అనేది మా విధానం. 40 ఏళ్ల క్రితమే ఎన్టీఆర్ పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని సంకల్పిస్తే, అదే స్ఫూర్తితో మేము పనిచేస్తున్నాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. దశాబ్దాలుగా సొంత కష్టార్జితంతో నిర్మించుకున్న ఇళ్లలో నివసిస్తున్నా, వాటిపై పూర్తి హక్కు లేదనే వేదనతో జీవిస్తున్న లక్షలాది మందికి ఈ పట్టాభిషేకం ద్వారా విముక్తి కల్పించామన్నారు.

"నిన్నటి వరకు మీ ఇంటిపై మీకు హక్కు లేదు. కానీ ఈరోజు నుంచి మీ ఇంటి మీద సర్వ హక్కులు మీవే. ఇకపై అనుమానం లేదు, వివాదం లేదు, భయం లేదు. తిరుగులేని హక్కు మాత్రమే ఉంటుంది" అని ఆయన భరోసా ఇచ్చారు. విశాఖ నగర పరిధిలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, గోపాలపట్నం సహా 111 మండలాల్లోని 399 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 19.33 లక్షల చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, రూ. 8,874 కోట్ల రిజిస్ట్రేషన్ విలువైన ఆస్తిని ప్రజలకు అప్పగించామని తెలిపారు. "నిన్నటి వరకు అప్పు కావాలంటే గ్యారెంటీ లేని మీరు, ఈరోజు ఈ ప్రభుత్వం ఇచ్చిన పట్టాతో ఏ బ్యాంకులోనైనా స్వేచ్ఛగా రుణం పొందవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు.

మిగిలిన వారికీ త్వరలోనే పట్టాలు.. అధికారులకు ఆదేశాలు

ఈ కార్యక్రమంతోనే ఆగమని, వివిధ కారణాలతో ఆగిపోయిన మరో 35 కాలనీల్లోని 10,000 కుటుంబాలకు, వివాదాల్లో ఉన్న పంచగ్రామాల పరిధిలోని 12,149 మందికి కూడా త్వరలోనే పట్టాలు అందించి శాశ్వత హక్కులు కల్పిస్తామని చంద్రబాబు సభాముఖంగా హామీ ఇచ్చారు. "దేవాలయ భూముల వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించి, వీలైనంత తొందరగా మీ అందరికీ న్యాయం చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది" అని ఆయన కలెక్టర్‌కు వేదిక నుంచే ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికీ హక్కు పత్రాలు అందించి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినట్టే!

గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్లు ఒక పీడకల. రూ.10 లక్షల కోట్ల అప్పులు, ఎక్కడ చూసినా కుంభకోణాలు, భూకబ్జాలు, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో అలజడి సృష్టించారు. శుక్రవారం వచ్చిందంటే ఏ ఇంటిని కూలుస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

"విశాఖను రాజధాని చేస్తామంటూనే, రుషికొండపై ఋషులు తపస్సు చేసిన చోట ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ఆ ప్యాలెస్‌ను ఏం చేయాలో కూడా అర్థం కాని దుస్థితిలో మేమున్నాం. దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినంత ఖర్చు అవుతుంది" అని ఎద్దేవా చేశారు. "నాడు కబ్జాలు, కూల్చివేతలు ఉంటే.. నేడు హక్కులు, భరోసా ఇస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, భయం నుంచి భరోసా వైపు, నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం" అని ఆయన ఉద్ఘాటించారు.

విశాఖ ఇక విశ్వనగరం.. నీటి సమస్యకు ఎన్డీయే గ్యారెంటీ!

విశాఖపట్నం భవిష్యత్తుపై చంద్రబాబు స్పష్టమైన దార్శనికతను ఆవిష్కరించారు. "రాబోయే రోజుల్లో విశాఖ ఒక విశ్వనగరంగా మారబోతోంది. ఇది ఇక అన్‌స్టాపబుల్. గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో పాటు అనేక ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది" అని ఆయన ప్రకటించారు.

విశాఖ నీటి సమస్యపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, "ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గినా, ముందుచూపుతో మేము పూర్తి చేసిన పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీళ్లు తెచ్చాం. ఇప్పుడు అదే కాలువను విశాఖ వరకు పొడిగించి, గోదావరి జలాలతో నగర దాహార్తిని శాశ్వతంగా తీర్చే బాధ్యత మా ఎన్డీయే ప్రభుత్వానిది. భవిష్యత్తులో విశాఖకు నీటి కొరత ఉండదు, ఇది మా గ్యారెంటీ" అని చంద్రబాబు గట్టిగా హామీ ఇచ్చారు.

అభివృద్ధికి అండగా నిలవండి.. 2047 లక్ష్యం మనదే!

పరిశ్రమలు తెచ్చి అవకాశాలు కల్పించడం తమ బాధ్యత అని, వాటిని అందిపుచ్చుకుని యువత ఎదగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "విశాఖ ఉక్కును కాపాడింది ఎన్డీయే ప్రభుత్వం. రైల్వే జోన్‌ను రియాలిటీగా మార్చింది మేము. పేదరికం లేని సమాజం, ఆర్థిక అసమానతలు తగ్గడమే మా లక్ష్యం" అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, 'స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలని కోరారు. "2047 నాటికి 'వికసిత భారత్'తో దేశం ప్రపంచంలో నంబర్ వన్ అవుతుంది.

అదే సమయంలో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం. ప్రపంచంలోనే తెలుగు జాతిని అత్యంత శక్తివంతమైన జాతిగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిదీ" అని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

జపాన్‌లో20వ ఆసియా క్రీడలు ఘనంగా ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

కోసం పోటీ పడనున్నారు.

ఈ చారిత్రాత్మక ఈవెంట్ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, దేశ క్రీడా బృందానికి తన శుభాకాంక్షలు తెలిపారు. "ఐచీ-నగోయాలో ఆసియా క్రీడలు ప్రారంభమవుతున్న వేళ, భారత బృందానికి నా శుభాకాంక్షలు. ప్రతి క్రీడాకారుడు అద్భుతమైన కృషి, అంకితభావం, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారు. వారిని చూసి భారతదేశం గర్విస్తోంది. వారు తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలి, బాగా ఆడాలి, ప్రకాశించాలి!" అని ప్రధాని 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.

ప్రారంభోత్సవ వేడుక భారత్‌కు ఎంతో ప్రత్యేకంగా నిలిచింది. ఒలింపిక్ పతక విజేత, షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్ భారత బృందానికి పతాకధారులుగా ముందుండి నడిపించారు. త్రివర్ణ పతాకాన్ని చేతబూని స్టేడియంలోకి అడుగుపెట్టిన వీరిపై దేశం భారీ అంచనాలు పెట్టుకుంది. 2023లో హాంగ్‌జౌలో జరిగిన గత ఆసియా క్రీడల్లో 28 స్వర్ణాలతో సహా మొత్తం 107 పతకాలు సాధించి భారత్ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఈసారి ఆ రికార్డును అధిగమించాలనే లక్ష్యంతో భారత బృందం బరిలోకి దిగుతోంది.ఆసియా క్రీడలకు జపాన్ ఆతిథ్యం ఇవ్వడం ఇది మూడోసారి. గతంలో 1958లో టోక్యోలో, 1994లో హిరోషిమాలో ఈ పోటీలు జరిగాయి. ఈసారి 45 దేశాలకు చెందిన క్రీడాకారులు 43 క్రీడాంశాల్లో తలపడనున్నారు.ఈ పోటీల్లో భారత్ పలు క్రీడల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. పురుషుల, మహిళల క్రికెట్, కబడ్డీ జట్లతో పాటు, పురుషుల హాకీ జట్టు కూడా తమ టైటిళ్లను నిలబెట్టుకోవాలని చూస్తోంది. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను భారత ప్రచారానికి నాయకత్వం వహించనున్నారు. షూటింగ్‌లో మను భాకర్, రెజ్లింగ్‌లో అమన్ సెహ్రావత్, బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహెన్ వంటి ప్రముఖులు పతకాలపై కన్నేశారు. అథ్లెటిక్స్‌లో 75 మందికి పైగా భారత క్రీడాకారులు బరిలో ఉన్నారు. గుల్వీర్ సింగ్, తేజస్విన్ శంకర్, జ్యోతి యర్రాజీ, పారుల్ చౌదరి వంటి అథ్లెట్లు తమ సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. షాట్‌పుట్‌లో తజిందర్‌పాల్ సింగ్ తూర్ వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచి, ఈసారి కూడా ఫేవరెట్‌గా పోటీ పడుతున్నాడు.

భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

మొదటిపేజీ తరువాయి

సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది" అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. "ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి" అని తెలిపారు.ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. "మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి" అని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి'ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'iGOT కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం..

మొదటిపేజీ తరువాయి

నాయకత్వాన్ని సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నామనే సంఖ్య కంటే, గెలిచే బలం ఉన్న స్థానాల్లో నిలబడి కచ్చితమైన విజయం సాధించడమే ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇవాళ్టి నుంచి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రానున్నారని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాజకీయాల్లో అనుభవమే అసలైన పాఠమని పేర్కొంటూ, జీవీఎంసీ పరిధిలో గతంలో గెలిచిన, రెండో స్థానంలో నిలిచిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేవలం టికెట్ వస్తే సరిపోదని... ప్రజల అవసరాలు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం కేడర్ నిరంతరం శ్రమించాలని నిర్దేశించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఐక్యత వల్లే రాష్ట్రంలో పెట్టుబడిదారులకు కొండంత భరోసా లభించిందని, ఉత్తరాంధ్రకు వస్తున్న భారీ ప్రాజెక్టులే దీనికి నిదర్శనమని చెప్పారు. జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల ప్రయోజనాల కోసమే పనిచేస్తుందని తెలిపారు.

భారతీయులకు పెరిగిన వీసా టెన్షన్

మొదటిపేజీ తరువాయి

నుంచి వచ్చే దరఖాస్తులు తగ్గినట్లు తాజా సర్వే వెల్లడించింది. వీసాల జారీ ఆలస్యం, వీసా తిరస్కరణలు, కఠినమైన ఇమ్మిగ్రేషన్ నిబంధనలు ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ పరిణామాలతో ముఖ్యంగా భారత్, చైనా నుంచి అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతోంది.

అమెరికన్ కౌన్సిల్ ఆన్ ఎడ్యుకేషన్ (ఏసీఈ) 328 మంది ఉన్నత విద్యా సంస్థల సీనియర్ అధికారులతో ఈ సర్వే నిర్వహించింది. ఇందులో 63 శాతం మంది ఇమ్మిగ్రేషన్ ఆంక్షలు, వీసాల రద్దుపై తీవ్రంగా లేదా కొంతమేర ఆందోళన ఉన్నట్లు చెప్పారు. అంతేకాదు.. 36 శాతం మంది ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు తమ యూనివర్సిటీలు సిద్ధంగా లేవని తెలిపారు.

అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య తగ్గడం అమెరికా యూనివర్సిటీల అడ్మిషన్లపైనే కాదు.. వాటి ఆర్థిక పరిస్థితిపైనా ప్రభావం చూపుతుంది. విదేశీ విద్యార్థులను చేర్చుకునే యూనివర్సిటీల అధ్యక్షుల్లో 73 శాతం మంది.. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో తమ ఆదాయం కూడా తగ్గిందని తెలిపారు.

దీని ప్రభావం ఇప్పటికే కొన్ని క్యాంపస్‌లలో కనిపిస్తోంది. 23 శాతం మంది అధికారులు పరిశోధనలు, విద్యార్థుల సహాయ కార్యక్రమాలకు కేటాయించే బడ్జెట్‌ను తగ్గించినట్లు చెప్పారు. 9 శాతం మంది కొన్ని కోర్సులను మూసివేయడం లేదా ఇతర కోర్సులతో విలీనం చేయాల్సి వచ్చిందన్నారు. మరో 11 శాతం మంది విద్యార్థులకు ఇచ్చే ఆర్థిక సాయం తగ్గినట్లు వెల్లడించారు.

అమెరికా యూనివర్సిటీలో సీటు రావడం ఒక్కటే ఇప్పుడు సరిపోదు. అడ్మిషన్ వచ్చిన తర్వాత వీసా ఎప్పుడు వస్తుంది? ఇమ్మిగ్రేషన్ నిబంధనల్లో ఏమైనా మార్పులు వస్తాయా? అనే అంశాలు కూడా విద్యార్థులకు కీలకంగా మారాయి.వీసా ప్రక్రియ ఆలస్యమైతే, నిర్ణయించిన సమయానికి విద్యార్థులు అమెరికా వెళ్లి తరగతులకు హాజరుకావడం కష్టమవుతుంది. అదే సమయంలో వీసాలపై అనిశ్చితి కొనసాగితే యూనివర్సిటీలు కూడా విదేశీ విద్యార్థుల సంఖ్యను అంచనా వేయడం కష్టమవుతుంది.

ఇప్పటికే అమెరికా యూనివర్సిటీల్లో దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం ప్రధాన ఆందోళనగా మారింది. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థుల దరఖాస్తులు, అడ్మిషన్ల తగ్గడం అక్కడి విద్యా సంస్థలకు మరో సవాలుగా మారుతోంది.

అక్టోబర్ 1న కరవు మండలాలను ప్రకటించండి

మొదటిపేజీ తరువాయి

ఎద్దడి తలెత్తకుండా పటిష్ఠమైన ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కరవు పరిస్థితులపై ప్రతీ నెలా కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని నిర్దేశించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ-ఉద్యాన పంటల పరిస్థితి, రైతుల ఇబ్బందులు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై శనివారం తన క్యాంపు కార్యాలయంలో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

కరువు మండలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, శాస్త్రీయంగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. వర్షపాతం, పంటల సాగు, భూగర్భ జలాలు, నేలలో తేమ శాతం, ఉపగ్రహ చిత్రాలు, జలాశయాల్లో నీటి నిల్వలు వంటి ఆరు కీలక అంశాలను సమగ్రంగా విశ్లేషించి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

513 మండలాల్లో కరవు ఛాయలు

2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ప్రాథమిక అంచనాల ప్రకారం మొత్తం 513 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటిలో 268 మండలాల్లో తీవ్రమైన వర్షాభావం, 245 మండలాల్లో మోస్తరు వర్షాభావం నెలకొందని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనను వ్యవసాయ శాఖ చేపడుతుందని, జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు పంట, దిగుబడి నష్టాన్ని అంచనా వేస్తాయని చెప్పారు. ఈ నివేదికలను కలెక్టర్లు సెప్టెంబర్ 24లోగా రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబర్ 29న జరిగే రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనలను పరిశీలించి, తుది జాబితాను సిద్ధం చేస్తామని అధికారులు వెల్లడించారు.విశాఖ సమీపంలోని రిజర్వాయర్లను యుద్ధప్రాతిపదికన నింపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని, మేఘాద్రిగడ్డకు పోలవరం ఎల్ఎంసీ ప్యాకేజీ-8 కింద పైపులైన్ ద్వారా నీటిని తరలించే పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రస్తుతం విశాఖ నగరానికి మరో రెండు నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు.

అనర్హత తీర్పుపై.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం

మొదటిపేజీ తరువాయి

ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై శుక్రవారం హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం విదితమే. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది.

ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే వర్తిస్తుందని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ గతంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలని, తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయానికి, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశాలు జారీ చేసింది.

మరోవైపు, ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశంపై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఏకపక్ష నిర్ణయం తీసుకోవద్దని వారు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

రాయలసీమ ఇన్నోవేషన్‌కు జేఎన్టీయూలో వేదిక

అక్టోబర్ 24, 25న ఇన్నోవేటర్ కాంక్లేవ్ -జేఎన్టీయూ విసి ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు







అనంతపురం ప్రతినిధి , సెప్టెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):
రాయలసీమలోని విద్యార్థులు, ఫ్యాకల్టీ, యువ ఇన్నోవేటర్లలోని ప్రతిభను వెలికితీసి పరిశ్రమలతో అనుసంధానం చేసేందుకు అనంతపురంలోని జేఎన్టీయూ వేదికగా అక్టోబర్ 24, 25 తేదీల్లో ఇన్నోవేటర్ కాంక్లేవ్ నిర్వహించనున్నట్లు జేఎన్టీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు తెలిపారు. శనివారం జేఎన్టీయూ ఆడిటోరియంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

క్యాపిటల్ ద్వారా పెట్టుబడుల అవకాశాలు కల్పిస్తాం
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం నుంచి విద్యార్థులు, మెంటార్లు, ఫ్యాకల్టీ, ఇన్నోవేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సుమారు 8 వేల మందికి పైగా ఇన్నోవేటర్లు, వందలాది కంపెనీల ప్రతినిధులు కాంక్లేవ్‌కు హాజరుకానున్నట్లు తెలిపారు.విద్యార్థులు, ఇన్నోవేటర్ల ఆలోచనలను కేవలం ప్రదర్శనకే పరిమితం చేయకుండా వాటిని ప్రొడక్ట్‌లుగా, స్టార్టప్‌లుగా, ఆ తర్వాత పరిశ్రమలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. సీడ్ ఫండింగ్, మెంటార్‌షిప్, ప్రోటోటైప్ అభివృద్ధి, పరిశ్రమల అనుసంధానం, వెంచర్ క్యాపిటల్ ద్వారా పెట్టుబడుల సమీకరణ వంటి దశల్లో అవకాశాలు కల్పిస్తామని వివరించారు. ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలకు పరిష్కారాలను అన్వేషించేలా హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. స్టార్టప్ ఎక్స్‌పో, స్కూల్ ఇన్నోవేషన్ ఎక్స్‌పో, పిచ్ ఫ్లోర్, ఇండస్ట్రీ రౌండ్‌టేబుల్స్ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ, హైడ్రోజన్, డిఫెన్స్, సోలార్ ఎనర్జీ, బ్యాటరీ స్టోరేజ్ తదితర రంగాల్లో పెట్టుబడులు వస్తున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా రాష్ట్రం నుంచే నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లు రావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్దేశించిన స్వర్ణాంధ్ర విజన్2047కు అనుగుణంగా ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించేందుకు కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కార్యక్రమానికి ఆహ్వానించనున్నట్లు చెప్పారు. ఐఈఈఈ జాతీయ చైర్మన్ కూడా పాల్గొననున్నట్లు తెలిపారు.

కాంక్లేవ్‌ను విజయవంతం చేయాలి
కాంక్లేవ్ ప్రజెంటర్‌గా విస్తారా విద్యానిధి ట్రస్ట్ తరపున వ్యవహరిస్తున్నట్లు సీఈవో శర్మాస్‌వలి చెప్పారు. పరిశ్రమలుఅకాడమియా మధ్య వారధిగా కాంక్లేవ్ పనిచేస్తుందన్నారు. 10 వేల మంది వరకు ఇన్నోవేటర్లు, 400కు పైగా ఎంఎన్‌సీ కంపెనీలు, 400కు పైగా స్టార్టప్‌లు, ప్రభుత్వ, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు ప్లేస్‌మెంట్ అవకాశాలు, పరిశ్రమలతో ఎంఓయూలు, ఇతర సహకారాలకు అవకాశం ఉంటుందన్నారు. రాయలసీమ విద్యార్థులు, ఫ్యాకల్టీలో ఉన్న ప్రతిభను ముందుకు తీసుకెళ్లేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు వినూత్న ఆలోచనలు ఉన్న ఫ్యాకల్టీ కూడా పాల్గొని కాంక్లేవ్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతికుమార్, రిజిస్ట్రార్ దుర్గారావు, సెంట్రల్ యూనివర్సిటీ, రతన్ టాటా ఇన్నోవేషన్ సీఈఓ, జిల్లా విద్యాశాఖ అధికారి ఆయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సేవకు గుర్తింపు

శ్రీవారి సేవకులకు అవార్డులు -ఎనిమిదేళ్లుగా సేవా కార్యక్రమాలు

డీ ఆర్ ఓ మలోల చేతులమీదుగా సర్టిఫికెట్లు ప్రధానం





అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):
సేవే లక్ష్యంగా.. సమాజమే స్ఫూర్తిగా ముందుకు సాగుతున్న శ్రీవారి సేవకుల సేవా కార్యక్రమాలకు గుర్తింపు లభించింది. అనంతపురం నగరంలో గత ఎనిమిదేళ్లుగా నిరంతరాయంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీవారి సేవకుల్లో 25 మందిని హ్యూమన్ రైట్స్ సంస్థ అభినందించింది. సేవలను గుర్తిస్తూ సర్టిఫికెట్లు, అవార్డులను అందజేసింది.

ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ
కలెక్టరేట్ ప్రాంగణంలోని డీఆర్వో ఛాంబర్‌లో శనివారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో డీ ఆర్ ఓ చేతుల మీదుగా 25 మంది శ్రీవారి సేవకులు సర్టిఫికెట్లు అందుకున్నారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా ఏటా ఉచిత మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తూ ప్రజల్లో మట్టి విగ్రహాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎనిమిదేళ్లుగా ఎలాంటి విరామం లేకుండా కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతున్న శ్రీవారి సేవకులను హ్యూమన్ రైట్స్ సంస్థ గుర్తించి సత్కరించడం పట్ల సేవకులు హర్షం వ్యక్తం చేశారు. అవార్డులు, సర్టిఫికెట్లు మరింత ఉత్సాహంతో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు.

చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం
ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ శ్రీవారి సేవకులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. భవిష్యత్‌లోనూ ప్రజలకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు తమవంతు ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు.శ్రీవారి సేవ మాస్టర్ ట్రైనర్ డాక్టర్ ఆళ్లగడ్డ రాము మాట్లాడుతూ.. తమ సేవలను గుర్తించి సర్టిఫికెట్లు, అవార్డులతో సత్కరించిన హ్యూమన్ రైట్స్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్వో చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లోనూ శ్రీవారి సేవకులందరితో కలిసి మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

మనసున్న మా రాజు ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్

చిన్నారి వైద్యానికి ఎమ్మెల్యే నెల వేతనం సాయం

అరుదైన వ్యాధితో బాధపడుతున్న అశ్వర్థకు అండగా దగ్గుపాటి

చిన్నారి కుటుంబానికి చెక్కును అందజేసిన ఎంపీ అంబికా ,ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం సంక్షేమం, సెప్టెంబర్ 19,(రిపబ్లిక్ న్యూస్):
అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న మూడేళ్ల చిన్నారి అశ్వర్థ గుణదత్తకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మనసున్న మారాజుగా అండగా నిలిచారు.చిన్నారి వైద్య ఖర్చుల కోసం తన నెల రోజుల వేతనాన్ని ఆర్థిక సాయంగా అందజేశారు. శనివారం అనంతపురంలోని అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి చిన్నారి తాతయ్య పుల్లయ్యకు వేతనానికి సంబంధించిన చెక్కును అందజేశారు.

సకాలంలో చికిత్స అందించకపోతే ప్రాణాపాయం ఉంది
కర్నూలు జిల్లాకు చెందిన హరీష్‌కుమార్, నవ్యశ్రీ దంపతులకు ఇద్దరు పిల్లలు. పెద్ద కుమారుడైన అశ్వర్థ గుణదత్త జన్యుపరమైన అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి ప్రభావంతో కండరాల బలహీనతకు గురై నిలబడటం, కూర్చోవడం కూడా కష్టంగా మారిందని కుటుంబ సభ్యులు తెలిపారు. చిన్నారి చికిత్సకు ఖరీదైన ఇంజెక్షన్ అవసరమని, సకాలంలో చికిత్స అందించకపోతే ప్రాణాపాయం ఏర్పడే అవకాశం ఉందని వైద్యులు సూచించినట్లు పేర్కొన్నారు.చిన్నారి పరిస్థితిపై సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గతంలోనే స్పందించారు.

మంత్రి నారా లోకేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్తాం
వైద్య ఖర్చుల కోసం తన నెల వేతనాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు శనివారం చెక్కును అందజేశారు. అనంతరం చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.చిన్నారి చికిత్సకు భవిష్యత్‌లో మరింత సహాయం అందించేందుకు మంత్రి నారా లోకేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యేకు చిన్నారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శాస్త్రీయ ఆలోచన అవసరం

రక్తదాతల కన్వీనర్ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి

తాపీ ధర్మారావుకు ఘన నివాళి -మూఢనమ్మకాలపై పోరాటం



అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 19,(రిపబ్లిక్ న్యూస్):
శాస్త్రీయ ఆలోచన విధానం అవసరమని రక్తదాతల కన్వీనర్ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగు మాధ్యమాల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ హేతువాది, రచయిత, సామాజిక చైతన్యవాది తాపీ ధర్మారావు 139వ జయంతిని శనివారం అనంతపురంలోని ఎస్ఎస్ఎస్ మోక్షిత్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి, ప్రముఖ హేతువాది, రక్తదాతల కన్వీనర్ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి హాజరై తాపీ ధర్మారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్య అభివృద్ధితోపాటు ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, సామాజిక చైతన్యం పెంపొందించేందుకు తాపీ ధర్మారావు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. మూఢనమ్మకాలను ప్రశ్నిస్తూ హేతుబద్ధమైన ఆలోచనా విధానాన్ని ప్రజల్లో పెంపొందించేందుకు ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. సామాజిక సమస్యలపై రచనల ద్వారా ప్రజలను చైతన్యపరిచారని పేర్కొన్నారు.తెలుగు మాధ్యమాల పరిరక్షణతోపాటు విద్యార్థుల్లో మాతృభాషపై ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మాతృభాషలో విద్యాబోధనతో భావవ్యక్తీకరణ, విషయ అవగాహన మెరుగుపడుతుందని తెలిపారు. విద్యార్థుల్లో ప్రసంగ నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కార్యక్రమంలో వారితో ప్రసంగాలు చేయించారు.ఉత్తమంగా ప్రసంగించిన పదో తరగతి విద్యార్థిని సి.ప్రసమ్యశ్రీ, తొమ్మిదో తరగతి విద్యార్థి ఆకుల దినకర్ మారుతికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా తెలుగు వెలుగు సంస్థ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సి.శ్రావణి, ఎం.సత్యానంద, రామప్ప, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన బాల్యం -ప్రతి ముద్దలో పోషణ పై విస్తృత అవగాహన కల్పించాలి



అనంతపురం సంక్షేమం, సెప్టెంబర్ 19,(రిపబ్లిక్ న్యూస్):
పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా చిన్నారులకు ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించడంతో పాటు తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. శనివారం నగరంలోని పాతూరులో బరమప్ప వీధి అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహిస్తున్న 9వ జాతీయ పోషణ్ మాస ఉత్సవ అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు.

బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ
అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారులు, వారి తల్లులు, గర్భిణులు, బాలింతలతో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు. పోషణ్ మాసం కార్యక్రమం ఉద్దేశం, పౌష్టికాహారం ప్రాధాన్యతను వారికి వివరించారు. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, వివిధ రకాల ధాన్యాలు, పప్పు దినుసులు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను భాగం చేసుకోవాలని సూచించారు.
కేంద్రంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. సమతుల ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై సిబ్బంది, మహిళలకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయి
అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు నిర్వహిస్తున్న ప్రీస్కూల్ కార్యకలాపాలను పరిశీలించిన కలెక్టర్ సిబ్బందిని అభినందించారు. చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు, వారి ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే పోషణ్ మాస కార్యక్రమాల ద్వారా ప్రజల్లో పోషకాహారంపై మరింత అవగాహన పెంచాలని సూచించారు. ఈ నెల 9 నుంచి అక్టోబర్ 8 వరకు జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో “ ప్రతి ముద్దలో పోషణ “ అనే నినాదంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమాలను కేవలం కేంద్రాలకే పరిమితం చేయకుండా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.కార్యక్రమంలో పీడీ సజిదా బేగం, సీడీపీఓ లలిత, సూపర్‌వైజర్లు హేమ, విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త జయభారతి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినోను ‘మైలినో’గా మార్చి రాజకీయ పబ్బం

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

: ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్‌రెడ్డి



ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 19 (ప్రజా రిపబ్లిక్ న్యూస్): ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యతపై ఆందోళనలు ఉన్న నేపథ్యంలో రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు.
ఎమ్మిగనూరులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినోను ‘మైలినో’గా మార్చి వైసీపీ నేతలు రాజకీయ విమర్శలు చేస్తున్నారని అన్నారు. వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. జలధారజలహారతి కార్యక్రమంలో రూ.3,409.35 కోట్లతో 79,826 పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఎర్రకోట నుంచి కల్లూరు వరకు రైతుల పంటలకు నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం తన బాధ్యత అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, మండల అధ్యక్షులు, పీఏసీఎస్ అధ్యక్షులు, క్లస్టర్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై షార్ట్‌ఫిలిం పోటీలు



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు

అనంతపురం సంక్షేమం, సెప్టెంబర్ 19,(రిపబ్లిక్ న్యూస్):
గర్భంలో ఉన్న శిశువు ఆడబిడ్డా.. మగబిడ్డా అని ముందుగానే తెలుసుకునే విధానాన్ని నిషేధిస్తూ అమల్లోకి తీసుకొచ్చిన లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు షార్ట్‌ఫిలిం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు.

లింగ నిర్ధారణ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన
ఈ నెలాఖరులోగా రూపొందించిన షార్ట్‌ఫిలింలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. చట్టం ఉద్దేశం, ఆడపిల్లల ప్రాధాన్యం, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వల్ల కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించేలా షార్ట్‌ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. న్యాయనిర్ణేతలు ఎంపిక చేసే ఉత్తమ చిత్రాలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. మొదటి బహుమతిగా రూ.30 వేలు, రెండో బహుమతిగా రూ.20 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేల నగదు అందించనున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. విజేతలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. పోటీలకు సంబంధించిన ఇతర వివరాల కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని కోరారు.

తాగు నీటి అవసరాలకు చెరువులు నింపే ప్రక్రియ ప్రారంభించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 19 రిపబ్లిక్ న్యూస్



ఆళ్లగడ్డ తాలూకా ఉయ్యాలవాడ మండలం ఆర్ పాంపల్లి గ్రామం లో చెరువును నింపే కార్యక్రమన్ని పరిశీలించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ఇచ్చిన మాట ప్రకారం ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాలే ధ్యేయంగా కేసీ కెనాల్, తెలుగు గంగా ప్రాజెక్ట్‌ల ద్వారా చెరువులను నింపే ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని. ఇందులో భాగంగానే ఇప్పటివరకు లక్ష్యానికి అనుగుణంగా 65 చెరువులకు గాను ఇప్పటికే 11 చెరువులను విజయవంతంగా నింపడం జరిగిందని. ఈరోజు ఉయ్యాలవాడ మండలం ఆర్. పాంపల్లెతో పాటు రుద్రవరం మండలం లాక్ దగ్గర కూడా చెరువులు నిండే ప్రక్రియను నేరుగా పరిశీలించి, అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని. ప్రతి నీటి బొట్టును అత్యంత జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలని, రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ఈ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాం అని. ముందుగా మన ప్రాంతంలోని కుంటలు, చెరువులన్నింటినీ పూర్తిగా నింపుకున్న తర్వాత, దేవుని దయతో నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటల సాగుకు కూడా పూర్తి స్థాయిలో నీటిని అందిస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నారు.

ఉయ్యాలవాడ సమీపంలో వ్యక్తి దారుణ హత్య



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 19 క్రైమ్ రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ తాలూకా ఉయ్యాలవాడ మండలం ఆర్.పాంపల్లె గ్రామ సమీపంలో శనివారం దారుణ హత్య ఘటన చోటు చేసుకుంది. ఉయ్యాలవాడకు వచ్చే రహదారిలో రామయ్య కోనేరు సమీపంలో మోటార్ సైకిల్ పై వ్యక్తి వెళ్తున్న చింతకుంట నాగార్జున అనే వ్యక్తిని దుండగులు అడ్డగించి కళ్ళల్లో కారం కొట్టి కత్తులతో పొడిచి హత్య చేసినట్లు స్థానికులు ఆరోపించారు. సమీపంలోని పంట పొలాల్లోకి తీసుకువెళ్లి కత్తితో హత్య గావించారు. మృతదేహంపై తీవ్ర గాయాలు ఉన్నాయి. ఘటనా స్థలాన్ని ఆళ్లగడ్డ డిఎస్పి శ్రీనివాసరావు సందర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

డి ఎస్సీ కి సెలక్ట్ అయిన అభ్యర్థులను కలిసిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 19 రిపబ్లిక్ న్యూస్



ఆళ్లగడ్డ తాలూకా ఉయ్యాలవాడ గ్రామం, ఎస్సీ కాలనీకి చెందిన కందుకూరి రామ ఆంజనేయులు భార్య నాగమణి, అలాగే బీసీ కాలనీకి చెందిన కె. చంద్రమౌళ్యా డీఎస్సీ కి సెలెక్ట్ అయ్యారు. ఈరోజు వారి నివాసాలకు వెళ్లి స్వయంగా కలిసిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ. వైసీపీ నాయకులు డీఎస్సీ నియామకాలపై కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తూ, అభ్యర్థులలో అనవసరమైన ఆందోళన సృష్టిస్తున్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలను చూసి ఎవరూ ఎలాంటి కంగారు పడాల్సిన అవసరం లేదని , భయపడాల్సిన పనిలేదని వారికి చెప్పానని . ఎంతో కష్టపడి మెరిట్‌తో సాధించుకున్న ఉద్యోగం విషయంలో అనవసర భయాలు వద్దని చెప్పానని . వారికి మా ప్రభుత్వం, నాయకులు ఎప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చాను. ప్రతిభావంతులైన మన యువతకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వబోమని ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేసిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ .

విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక చర్యలు

- రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో
- 650 మంది విద్యార్థులు
- విద్య పై ప్రత్యేక శ్రద్ధ
- సమయపాలన క్రమశిక్షణ అవసరం
- ప్రతిరోజూ మిడ్‌డే మీల్స్ పర్యవేక్షణ
- ప్రిన్సిపల్ అశోక్ నాయక్





మంత్రాలయం, సెప్టెంబర్ 19 (ప్రజారిపబ్లిక్ న్యూస్): మండలంలోని రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సుమారు 650 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారిలో క్రమశిక్షణ, బాధ్యత, మంచి నడవడికను పెంపొందించేలా పాఠశాలలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

విద్యపై ప్రత్యేక శ్రద్ధ

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా ప్రమాణాల పెంపునకు ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. తరగతి గదుల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తూ, వారికి అర్థమయ్యే విధంగా బోధన అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై, ఉపాధ్యాయులు చెప్పే విషయాలను శ్రద్ధగా వినాలని సూచించారు.

సాయంత్రం ప్రత్యేక తరగతులు

విద్యార్థుల్లో చదువులో వెనుకబడిన వారిని గుర్తించి, ఆయా అంశాలపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతున్నామని అశోక్ నాయక్ తెలిపారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, పరీక్షలకు మెరుగైన రీతిలో సిద్ధం చేసేందుకు సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి విద్యార్థి తన సామర్థ్యాన్ని గుర్తించి చదువుపై దృష్టి సారించేలా ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.

విద్యాశక్తి కార్యక్రమం

పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు విద్యాశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల విద్యా పురోగతిని పరిశీలిస్తూ, అవసరమైన చోట అదనపు బోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

మిడ్‌డే మీల్స్‌పై పర్యవేక్షణ

పాఠశాలలో విద్యార్థులకు అందించే మిడ్‌డే మీల్స్‌ను ప్రతిరోజూ పరిశీలిస్తున్నామని అశోక్ నాయక్ తెలిపారు. భోజనం నాణ్యత, పరిశుభ్రత తదితర అంశాలను పర్యవేక్షిస్తూ విద్యార్థులకు సక్రమంగా భోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువు రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు.

సమయపాలన.. క్రమశిక్షణ అవసరం

విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు త్వరగా, సమయానికి హాజరై తరగతులకు సిద్ధంగా ఉండాలని ప్రిన్సిపాల్ సూచించారు. సమయపాలన, క్రమశిక్షణ విద్యార్థి జీవితంలో ఎంతో ముఖ్యమైనవని తెలిపారు. పాఠశాల నియమాలను పాటిస్తూ ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

విద్యార్థులు చదువుతో పాటు మంచి సంస్కారం, నడవడికను అలవర్చుకోవాలని అశోక్ నాయక్ సూచించారు. తల్లిదండ్రులను గౌరవించడం, వారి సూచనలను పాటించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునేలా కృషి చేయాలని పేర్కొన్నారు. 650 మంది విద్యార్థులతో కొనసాగుతున్న రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, క్రమశిక్షణ, ప్రత్యేక తరగతులు, విద్యాశక్తి కార్యక్రమం, మిడ్‌డే మీల్స్ పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

స్వర్ణంధ్రా స్వచ్ఛంధ్రా కార్యక్రమం



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 19 రిపబ్లిక్ న్యూస్



ఆళ్లగడ్డ మండలం చిన్న కందుకూరు గ్రామం లో ప్రతినెల మూడవ శనివారం నాడు స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్రా కార్యక్రమంలో భాగంగా నేడు పాత కందుకూరు గ్రామపంచాయతీ నందు పారిశుద్ధ్యం,పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ,తీర ప్రాంత పరిశుభ్రత, మరియు ప్రజా భాగస్వామ్య కార్యక్రమాల పై గ్రామంలోని విద్యార్థిని విద్యార్థులకు మరియు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగినది అలాగే స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల్లో భాగంగా నేడు గ్రామంలోని చెత్తకుప్పలను తొలగించడం జరిగినది ఈ కార్యక్రమానికి మండల అధికారి హరి గోపాల్ అలాగే మండల అభివృద్ధి అధికారి కుమారి నూర్జహాన్, ఉప మండల అభివృద్ధి అధికారి రాఘవేంద్ర రాజు, సరళమ్మ అలాగే గ్రామ పెద్దలు మాధవ రెడ్డి మండల స్థాయి అధికారులైన ఏపీఎం గోపాలు, ఏపీవో ప్రతాపు మరియు మండల స్థాయి అధికారులు అలాగే గ్రామ సచివాలయ అధికారులతో కార్యక్రమం నిర్వహించడం జరిగినది.

పోలింగ్ కేంద్రాల తుది జాబితా విడుదల



బండి ఆత్మకూరు ,సెప్టెంబర్ 19,(రిపబ్లిక్ న్యూస్):- బండి ఆత్మకూరు మండలంలోని మండల ప్రాదేశిక నియోజక వర్గాలు, జిల్లా ప్రాదేశిక నియోజక వర్గాలు (ఎంపీటీసీ, జెడ్పీటిసి) పోలింగ్ కేంద్రాల తుది జాబితాను మండల పరిషత్ అధికారులు విడుదల చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గాయిత్రి డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి, పరిపాలనాధికారి శ్యామల దేవి, సీనియర్ అసిస్టెంట్ చంద్రకళతో కలిసి పోలింగ్ కేంద్రాల తుది జాబితా నోటీసు బోర్డు నందు పొందుపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నోటీస్ బోర్డు నందు పొందుపరచడం జరిగిందన్నారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని రాజకీయ పార్టీలకు సమయం కేటాయించి ప్రత్యేకంగా అభ్యంతరాల స్వీకరణకు గడువు ఇవ్వడం జరిగిందన్నారు. అయితే పోలింగ్ కేంద్రాలపై ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో అభ్యంతరాల స్వీకరణ గడువు అనంతరం తుది జాబితా ప్రదర్శించినట్లు ఆమె తెలిపారు. మండల వ్యాప్తంగా సుమారు 38380 ఓటర్లు ఉండగా 42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోయి భీమన్న జయంతి



గుత్తి సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)

పట్టణంలోని ఫుట్‌బాల్ మైదానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల భవన్‌లో శనివారం బోయి భీమన్న 115వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు అబూబాకర్, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, కార్యదర్శి రామ్‌మోహన్ బోయి భీమన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జెన్నే కుల్లాయిబాబు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో జన్మించిన బోయి భీమన్న ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్‌తో పాటు పలు గౌరవాలు, సన్మానాలు పొందారని పేర్కొన్నారు. పద్యం, గద్యం, గేయం, నాటకం, నాటిక, వచన కవిత తదితర సాహితీ ప్రక్రియల్లో 70కుపైగా రచనలు చేశారని గుర్తుచేశారు. బోయి భీమన్న జయంతి సందర్భంగా ఆయన సాహితీ సేవలను స్మరించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

కార్యక్రమంలో అధ్యక్షుడు అబూబాకర్, కార్యదర్శి రామ్‌మోహన్, షైక్షావళి, నారాయణరెడ్డి, శామ్యూల్, లక్ష్మీనారాయణరెడ్డి, హస్సన్ అహ్మద్, నారాయణశెట్టి, నరసింహులు, డేనియల్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ చిదంబరం మృతి

పలువురు నాయకుల సంతాపం



గుత్తి సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)

మండలంలోని ఊబిచర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చిదంబరం శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా మృతి చెందారు. ఆయన మృతి పట్ల గ్రామస్థులు, పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. చిదంబరం గ్రామ అభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం అండ

సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.11.97 లక్షల ఆర్థిక సాయం..

చెక్కులు పంపిణీ చేసిన కర్నూలుఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 19(రిపబ్లిక్ న్యూస్)

పేదల సంక్షేమం, ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. పంచలింగాల గ్రామంలోని తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం రూ.11,97,287 విలువైన చెక్కులను ఆయన అందజేశారు.

ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఖరీదైన వైద్య చికిత్స చేయించుకోలేని కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా లభిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పేద ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీ స్పష్టం చేశారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

చౌడేపల్లిలో విషాదం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

చౌడేపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 19 రిపబ్లిక్ న్యూస్



చౌడేపల్లిలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది రెండు స్కూటర్లు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు చౌడేపల్లి పలమనేరు ప్రధాన రహదారిలో చిట్టి రెడ్డి పల్లి వద్ద ఇరుమార్గాల నుంచి వస్తున్న రెండు స్కూటర్లు ఢీకొన్నాయి ఈ ప్రమాదంలో చౌడేపల్లి పట్టణం కుమ్మర వీధికి చెందిన మహేష్ (26) చౌడేపల్లి పరిధిలోని గోసల కురపల్లికి చెందిన సంతోష్ (22) అక్కడికక్కడే మృతి చెందారు అదే విధంగా చౌడేపల్లి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ నరేంద్ర గోశాల కొరపల్లికి చెందిన చంద్రశేఖర్ లకు తీవ్ర గాయాలయ్యాయి గాయపడ్డ వారిని మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు విషయం తెలిసిన వెంటనే పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్ ను మళ్లించి ఇద్దరి మృతి దేహాలను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి సేవ పరీక్ష నిమిత్తం తరలించారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు కాగా మహేష్ ఇండియన్ బ్యాంకులో స్కావెంజర్ గా పని చేస్తున్నాడు అందరిలో మంచి పేరు ఉండడంతో ఒక్కసారిగా చౌడేపల్లి శోకసముద్రంలో మునిగిపోయింది. అదేవిధంగా కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్న సంతోష్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటు అయింది బ్యాంకు మేనేజర్ నరేంద్రకు కుడికన్ను తీవ్ర గాయం కావడం అదేవిధంగా తలపై బలమైన గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. మహేష్ కు వివాహం జరిగి ఆరు నెలలు అయింది ప్రస్తుతం మృతుని భార్య నాలుగు నెలల గర్భవతి ఇరు కుటుంబాలలోను సంపాదకులు మృతి చెందడంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదు - వీఆర్ఏలు

బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 19,(రిపబ్లిక్ న్యూస్):- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా వీఆర్ఏలు సమస్యలు పరిష్కారం కాలేదంటూ సమస్యలు పరిష్కారం చూపే వరకు సమ్మె విరమించేది లేదనీ వీఆర్ఏ లు హెచ్చరించారు. బండి ఆత్మకూరు మండలంలోని వీఆర్ఏలు చేపట్టిన నిరవధిక సమ్మె 4వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శనివారం వీఆర్ఏలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట 4వ రోజు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో రెవెన్యూ సహాయకులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరిచారన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తైన కానీ వీఆర్ఏల సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందానా ఉన్నాయని మండిపడ్డారు. తమను పట్టించుకునే నాథుడే లేడంటూ గ్రామ రెవెన్యూ సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
వేతన పెంపు లేదు, పదోన్నతులు లేవు, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. మరి తమ బతుకులు ఎలా సాగించాలంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతోనే సమ్మెకు దిగాల్సి వచ్చిందని అన్నారు.
వీఆర్ఏల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న, నంద్యాల జిల్లా అధ్యక్షుడు, నారాయణ, బండి ఆత్మకూరు మండల అధ్యక్షుడు శేషు, తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం గారు ఎన్నికల సమయంలో మాటిచ్చారు అధికారంలోకి వచ్చాక అమలు చేయడం మరిచారా.

రైల్వే కోడూరు సెప్టెంబర్ 19 రిపబ్లిక్ న్యూస్.



సీఎం గారు మాలలను మరిచిపోయారా? ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానం మరిచారా! అధికారంలోకొచ్చి రెండు సంవత్సరాలు దాటిన ఇంతవరకు ఎస్సీ మాల కార్పొరేషన్ కు నిధులు మంజూరు చేయడం మరిచారు, మాటిచ్చి ఓట్లు వేయించుకున్నారు ఇకనైనా మాపై దయ ఉంచి నిధులు విడుదల చేయాలని శనివారం రిపబ్లిక్ న్యూస్ ప్రతినిధి ద్వారా అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోలం రెడ్డి మల్లికార్జున రాష్ట్ర ముఖ్యమంత్రి,కోరుతున్నా రు, పోలంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అయిన ఎస్సీ మాల కార్పొరేషన్ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతీ యువకులు గత ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ నిధులు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా 27 సంక్షేమ పథకాలను పూర్తిగా రద్దు ఎస్సీ నిరుద్యోగ భవితను తుంగలోకిన విషయం తమకు తెలుసు తమరు ఎలక్షన్ లో గెలిస్తే ఎస్సీ కార్పొరేషన్ 27 సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేస్తానని మాట ఇచ్చి ఇప్పటికి రెండు సంవత్సరాలు కావస్తుంది ఎస్సీ కార్పొరేషన్ కి ఒక రూపాయి కూడా నిధులు మంజూరు చేయ లేదు కానీ ప్రచారం చేసుకోవడంలో ఏమాత్రం తగ్గడం లేదు అధికారం లేనప్పుడు 27 ఎస్సీ సంక్షేమ పథకాల గురించి తీవ్రమైన విమర్శలు చేశారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు .మాల ఎస్సీ కార్పొరేషన్ కోసం ఎదురుచూపులు చూస్తూ కళ్ళు కాయలు కాసి పోతున్నాయి ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేసినట్లయితే నిరుద్యోగ యువతీ యువకులు కు ఉపాధి కల్పించిన వారవుతారు కొంతమంది అయినా ఎస్సీ కార్పొరేషన్ నిధులు ద్వారా కొన్ని కుటుంబాలు ఆర్థికంగా డెవలప్ కావడానికి ఆస్కారం ఉంది తమరు మాలలపై దయవుంచి ఎస్సీ కార్పొరేషన్ నిధులను మంజూరు చేసి ఎస్సీ మాల యువతీ యువకులకు ఉపాధి కల్పిస్తారని కోరుతున్నాను

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వాలని పోలీసుల విజ్ఞప్తి

గుత్తి సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) గుత్తి మండలంలోని కర్నూలు రోడ్డులో ఎన్టీపీసీ పవర్‌గ్రిడ్ వెనుక వైపు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసున్న వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతదేహం లభించిన తీరును బట్టి సుమారు 15 రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో గుర్తించడం సాధ్యం కాలేదని పోలీసులు తెలిపారు.మృతుడి ఆనవాళ్లుగా నీలం రంగు టీషర్టు, బ్రౌన్ రంగు ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి గురించి ఏదైనా సమాచారం తెలిసిన వారు గుత్తి సీఐ సెల్ నంబర్ 9346010582, ఎస్ఐ సెల్ నంబర్ 9346917082కు సమాచారం అందించాలని కోరారు.

ముఖ్యమంత్రిసహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న, జనసేన ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మీలు.

రైల్వే కోడూరు సెప్టెంబర్ 19 రిపబ్లిక్ న్యూస్.



రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం, మంగంపేట, ఎల్లాయిపల్లి, చిన్నఓరంపాడు, ఇతర పంచాయతీలలో శనివారం రైల్వే కోడూరు జనసేన పార్టీ శాసనసభ్యులు, కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి, ముక్కా వరలక్ష్మీలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారుల స్వగృహాలకు వెళ్లి పంపిణీ చేశారు,మరియు కూటమి నాయకులు. గ్రామాల్లో పర్యటించి సీఎం సహాయనిధి చెక్కులను ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు, ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత,ప్రభుత్వ పథకాలు ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో రాష్ట్రం అంచలంచెలుగా అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు, అంతేకాకుండా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశంలోనే రెండో స్థానంలో ఉందన్నారు, అత్యధికంగా సీఎం రిలీఫ్ ఫండ్ సహాయనిది చెక్కులు పేద బడుగు బలహీన వర్గాలకు పంపిణీలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు,అందుకే అధికంగా లబ్ధిదారుల అభ్యర్థనలు వచ్చాయన్నారు సీఎం సహాయ నిధి లబ్ధిదారులకు ఒక ఆర్థిక నిధి అని వారు సూచించారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కల్లా చలపతి, వేమన సుబ్రహ్మణ్యం నాయుడు,వాసుదేవ రెడ్డి,బత్తిన వేణుగోపాల్ రెడ్డి,కోటేశ్వర్ నాయుడు,సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.250 కోట్లతో ఇంటింటికీ తాగునీరు

మంచినీటి పైప్‌లైన్ పనులకు భూమిపూజ.. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టు









గుత్తి సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)
నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గుత్తి పట్టణంలో జిందాల్ ఆధ్వర్యంలో రూ.250 కోట్లతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్, ఇంటింటికీ తాగునీటి కొళాయిల ఏర్పాటు పనులకు శనివారం భూమిపూజ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు ఎమ్మెల్యే జయరాం తెలిపారు. ఇప్పటివరకు నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్న మహిళలకు ఈ పథకం ఉపశమనం కలిగిస్తుందన్నారు. ఇంటింటికీ కొళాయి ద్వారా శుద్ధమైన నీరు అందుబాటులోకి వస్తే ప్రజలకు సమయం ఆదా కావడంతో పాటు నీటి ద్వారా వచ్చే అనారోగ్యాలు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా..

రాబోయే 20 నుంచి 30 ఏళ్లలో పెరిగే జనాభా, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పైప్‌లైన్ వ్యవస్థను రూపొందించినట్లు జయరాం తెలిపారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలో భవిష్యత్తులో తాగునీటి కొరత తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరలోనే ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా నీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.పనుల నాణ్యత విషయంలో రాజీపడకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా ప్రాజెక్టు అమలును నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు.

కోట అభివృద్ధికి సహకారం

గుత్తి కోట అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ తెలిపారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న గుత్తి కోటను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారి కుటుంబాల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.
కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షుడు బద్రివలి, దిల్ కా సీన,మండల అధ్యక్షుడు లక్ష్మీరంగయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, రమేష్,రాజా, మాజీ కౌన్సిలర్ సుంకన్న, పవన్‌కుమార్ యాదవ్, ఎన్ఎం భాష, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చౌదరి, భరత్, వీరాంజనేయులు, జనసేన మండల అధ్యక్షుడు చిన్న వెంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి బోయగడ్డ బ్రహ్మయ్య, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బీసీ వెంకప్ప, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి తెగదొడ్డి తిమ్మారెడ్డి, మండల అధ్యక్షుడు బాబయ్య, మార్కెట్ డైరెక్టర్ బావిగడ్డ ఓబులయ్యతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలుగో రోజూ వీఆర్ఏల సహాయ నిరాకరణ

అర్ధనగ్నంగా నిరసన.. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్

గుత్తి సెప్టెంబర్ 19(రిపబ్లిక్ న్యూస్)
తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏలు చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా అర్ధనగ్నంగా దీక్షలు చేపట్టి నిరసన తెలిపారు. పనికి తగిన సమాన వేతనం కల్పించడంతో పాటు తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
వీఆర్ఏలకు ఇప్పటికీ పే స్కేలు అమలు చేయలేదని సంఘం నాయకులు తెలిపారు. తమ సమస్యలపై పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఇటీవల రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ మంత్రిని కలిసి వీఆర్ఏలు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు.



డిమాండ్లు ఇవే..

వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, నామినీలను పర్మినెంట్ వీఆర్ఏలుగా నియమించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని, ప్రమోషన్ల కోటాను 30 శాతం నుంచి 70 శాతానికి పెంచాలని కోరారు. విధి నిర్వహణలో మృతి చెందిన వీఆర్ఏల కుటుంబాల్లో వయసుతో సంబంధం లేకుండా ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.ఆగస్టు 19న సీసీఎల్ఏ మంగళగిరి అధికారులకు తమ సమస్యలపై మెమొరాండం సమర్పించినట్లు తెలిపారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు తమ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని వీఆర్ఏ సంఘం నాయకులు కోరారు.కార్యక్రమంలో వీఆర్ఏ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సుధాకర్, ఉపాధ్యక్షుడు పెద్దన్న, కోశాధికారి రాంప్రసాద్, వినోద్, సలహాదారుల కమిటీ సభ్యులు నారాయణస్వామి, చిరంజీవి, సరస్వతి, క్రమశిక్షణ కమిటీ సభ్యులు సుధాకర్, జగదీష్, యుగంధర్‌తో పాటు వీఆర్ఏలు పాల్గొన్నారు.

కుందన గుర్తి మాల ఆనంద్‌కు తక్షణ రక్షణ కల్పించాలి

మాల రాష్ట్ర ఉద్యోగ సంఘ అధ్యక్షుడు తుల్లి బుల్లి అశోక్‌కుమార్ డిమాండ్

చిప్పగిరి, సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) కుందన గుర్తి మాల ఆనంద్ కు ప్రాణహాని ఉందని, ఆయనకు తక్షణమే పోలీసు రక్షణ కల్పించాలని రాష్ట్ర ఉద్యోగ సంఘ అధ్యక్షుడు తుల్లి బుల్లి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం చిప్పగిరిలో నిర్వహించిన మాల మహానాడు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆనంద్‌కు ఎదురవుతున్న బెదిరింపులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.
టీడీపీ మండల కన్వీనర్ కొండ పురుషోత్తం అక్క కుమారుడి నుంచి మాల ఆనంద్‌కు ప్రాణహాని ఉందని అశోక్‌కుమార్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఆనంద్‌పై బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
అధికార పార్టీని అడ్డుపెట్టుకుని కొండ పురుషోత్తం





గుండాయిజానికి పాల్పడుతున్నారని అశోక్‌కుమార్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, నేరం రుజువైతే ఎస్సీ, ఎట్రాసిటీ చట్టంతో పాటు సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడికి న్యాయం జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.
అనంతరం మాల మహానాడు నాయకులు, కార్యకర్తలతో కలిసి చిప్పగిరి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ సి.వి. నరసింహులుకు ఫిర్యాదు అందజేశారు. మాల ఆనంద్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేపడతామని అశోక్‌కుమార్ హెచ్చరించారు.

ఏపిఎండిసి నిబంధనలు తుంగలో తొక్కి అక్రమంగా ముగ్గురాయి విక్రయిస్తున్న మిల్లులు

బ్లాక్లిస్టులో పెట్టిన అధికారులు.

రైల్వే కోడూరు సెప్టెంబర్ 19 రిపబ్లిక్ న్యూస్.



రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం మంగంపేట. ఏపీఎండిసి పరిధిలో, కొంతమంది పల్వారైజింగ్ బిల్లు యజమానులు,అక్రమంగా కొన్ని ఎక్స్పోర్ట్ మిల్లులకు అక్రమ మార్గంలో ముగ్గురాయిని విక్రయించినందుకుఆమిల్లు లను ఏపీఎండీసీ అధికారులు బ్లాక్లిస్టులో పెట్టడం జరిగిందని విశ్వాసనీయ సమాచారం,ఎక్స్పోర్ట్ కంపెనీలకు ముగ్గురాయిని విక్రయించడం ఏపీఎండిసి సంస్థ నియమ నిబంధనలకు విరుద్ధమని, అలా ముగ్గురాయి విక్రయించకూడదని నిబంధనలు ఉండడంతో కొంతమంది ఉద్యోగులు సంస్థలో పనిచేస్తూ ముగ్గురాయి వ్యాపార లావాదేవీలు సాగిస్తూ ఉంటారు,కానీ కొంతకాలం వాళ్ళ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు గా విరాజిల్లింది అయితే ప్రస్తుతం ఏపీఎండిసి సంస్థ నిబంధనలు మేరకు అక్కడ ఎటువంటి క్రమాలకు తావు లేకుండా,నిష్పక్షపాతముగా విధులు నిర్వహించడంతో వారికి ముగ్గురాయి విక్రయించిన విషయం సమాచారం అందరంతో ఆ ఉద్యోగుల పల్వా రిన్సింగ్ బిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టడం జరిగిందని తెలుస్తోంది,ఏదేమైనా భర్తల ఉద్యోగం, భార్యలు బడా వ్యాపారం ముగ్గురాయి వ్యాపారం చేస్తూ ఉండడంతో వీరి బంగారం బట్టబయలు అయిందని పలువురు విమర్శిస్తున్నారు ఏది ఏమైనా సీసీ కెమెరాలు కళ్ళు కప్పిగతంలో కొంతమంది ముగ్గురాయిని పక్క దోవ పట్టించారని విమర్శలు లేకపోలేదు ఏది ఏమైనా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇక్కడ ఏపీఎండిసి ముగ్గురాయి అక్రమ రవాణాకు తావు లేకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది ఈ మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టడంతో మంగంపేటలో పలువురు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు,

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/67888

చెరువు మట్టి తరలింపులో బిజీ బిజీగా మట్టి మాఫియా దందా....

అరికట్టడంలో ఘోరంగా విఫలమవుతున్న అధికారులు.





రైల్వే కోడూరు సెప్టెంబర్ 19 రిపబ్లిక్ న్యూస్.రైల్వేకోడూరు నియోజకవర్గంలో పుల్లంపేట మండలంలో రెడ్డిపల్లి చెరువులో ఉన్న విలువైన మట్టి ఖనిజాన్ని మట్టి మాఫియా విచ్చలవిడిగా ట్రిప్పు వెయ్యి రూపాయల నుంచి, 1200 రూపాయల వరకు రైతులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది, రంగంపల్లి చెరువు మరియు రెడ్డిపల్లి చెరువులో ప్రతినిత్యం మట్టి మాఫియా చెరువు మట్టిని తరలిస్తూ దందా చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి, వీటిని నివారించాల్సిన సంబంధిత అధికారులు ఘోరంగా విఫలమై,ఏమి తెలియనట్లు వ్యవహరిస్తూ,చోద్యం చూస్తున్నా రని స్థానికులు ఆరోపిస్తున్నారు అంతేకాకుండా ఎక్కడపడితే అక్కడ గుంతలు తొవ్వి,విలువైన మట్టిని తరలిస్తూ రేపు వర్షం వచ్చినప్పుడు ఈ ప్రాంతాలలో పశువులు పిల్లలు తిరుగుతూ ఉంటే ప్రమాదాల భారీపడి మృత్యువాత పడతారని పలువురు ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,ఇప్పటికైనా సంబంధిత అధికారులు అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు ఆర్థిక విశ్లేషకులురైతులు కోరుతున్నారు . ప్రస్తుతం మట్టి మాఫియా పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో మట్టి అక్రమ తరలింపును అరి కట్టేవారు లేకుండా పోతున్నారని పలువురు అధికారులు కోరుతున్నారు. ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా అక్రమ మార్గంలో మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని,అలాగే అనుమతులు పొందితే ప్రభుత్వానికి కొంతవరకు ఆర్థిక గండి పడకుండా కొంత ప్రభుత్వానికి ఆదాయం చెందుతుందని పలువురు నాయకులు రైతులు కోరుతున్నారు, సంబంధిత ఇరిగేషన్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ వొకేషనల్ కాలేజీలో చైల్డ్ హెల్ప్ లైన్-1098పై అవగాహన సదస్సు





కర్నూలు, సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)

కర్నూలు నగరంలోని బి-క్యాంపు ప్రభుత్వ వొకేషనల్ కాలేజీలో విద్యార్థులకు చైల్డ్ హెల్ప్ లైన్-1098 సేవలు, బాలల హక్కులు, బాలల రక్షణ చట్టాలు మరియు బాలల సంరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా డీసీపీఓ శారద మాట్లాడుతూ బాలల హక్కులు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలలపై జరిగే వివిధ రకాల హింసను గుర్తించే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల సమస్యలను గుర్తించినప్పుడు వాటిని దాచిపెట్టకుండా వెంటనే సంబంధిత అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్ లైన్-1098కు సమాచారం అందించాలని సూచించారు.చైల్డ్ హెల్ప్ లైన్-1098 ప్రాజెక్టు కోఆర్డినేటర్ డి. సుంకన్న మాట్లాడుతూ బాలల రక్షణ, సంరక్షణ మరియు హక్కుల పరిరక్షణ కోసం చైల్డ్ హెల్ప్ లైన్-1098 నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. బాల్య వివాహాలు, బాల కార్మికత్వం, బాలలపై హింస, వేధింపులు, నిర్లక్ష్యం, బాలల అక్రమ రవాణా తదితర సమస్యలు ఎదురైనప్పుడు, అలాగే ఏదైనా బాలబాలికలు ఆపదలో ఉన్నప్పుడు వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్-1098కు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు.



అలాగే బాలల సమస్యలపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్పందించి, బాలల రక్షణలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగస్వామి నాయక్, కళాశాల సిబ్బంది, లెక్చరర్లు, డీసీపీయూ లీగల్ ప్రొబేషన్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, డీసీపీయూ కౌన్సిలర్ నాగేశ్వరరావు, సోషల్ వర్కర్ నరసింహులు, చైల్డ్ హెల్ప్ లైన్-1098 సిబ్బంది భాస్కర్, మారెన్న మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

రాయికల్ గో సేవ కండ ప్రముఖ శ్రీ గద్దే సుమన్ గోవు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ విజ్ఞానం పుస్తకాల పంపిణీ



రాయికల్ మండలం సెప్టెంబర్,19(రిపబ్లిక్ న్యూస్)

గోవిజ్ఞాన పరీక్షలకు ఉపకరించే గోవు పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ విజ్ఞానం పుస్తకాలను జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గో సేవా ఖండ ప్రముఖ్ గద్దె సుమన్ మాట్లాడుతూ , రైతు యొక్క నాగలి, ఆవు యొక్క పాలు దేశాభివృద్ధికి మూలస్థంబాలని అన్నారు గో సంతతిని సంరక్షణ చేయడం వల్ల భావితరాలకు స్వయం ఉపాధి చేకూరుతుందని వివరించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి. రాజశేఖర్ ,చెరుకు మహేశ్వర శర్మ, ఏ పద్మ ,జి. తరంగిణి, యస్ శోభ, ఎం రమ తదితరులు పాల్గొన్నారు

ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికల్లో ఏబీవీపీ హవా..

మూడు పదవులు కైవసం

ఢిల్లీ సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)

ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల ఫలితాల్లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ప్రధానమైన నాలుగు స్థానాలకు గానూ మూడింటిని ఏబీవీపీ కైవసం చేసుకుంది. కాగా, ఉపాధ్యక్ష పదవిలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించి సరికొత్త చరిత్ర సృష్టించారు. దాదాపు 20 రౌండ్ల పాటు అత్యంత ఉత్కంఠగా సాగిన ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల అధికారులు తుది ఫలితాలను వెల్లడించారు.

ఏబీవీపీ తరఫున అధ్యక్ష పదవికి పోటీ చేసిన యశ్ దబాస్ 24,576 ఓట్లతో ఘనవిజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి విజయ్ శంకర్ మీనా (22,523 ఓట్లు)పై ఆయన గెలుపొందారు. అదేవిధంగా కార్యదర్శిగా రియా ఛావడి (21,650 ఓట్లు), సంయుక్త కార్యదర్శిగా లక్ష్య రాజ్ సింగ్ (16,615 ఓట్లు) ఏబీవీపీ నుంచి విజేతలుగా నిలిచారు.మరోవైపు, ఉపాధ్యక్ష పదవికి జరిగిన పోరులో స్వతంత్ర అభ్యర్థి దీపాంశు షోకీన్ సంచలన విజయాన్ని నమోదు చేశారు. ఆయనకు ఏకంగా 30,615 ఓట్లు పోలవ్వడం విశేషం. ఈ పదవికి పోటీపడిన ఏబీవీపీ అభ్యర్థి ఇషు మౌర్యకు 16,910 ఓట్లు, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి వీర్ చత్రత్‌కు కేవలం 4,313 ఓట్లు మాత్రమే దక్కాయి. గతంలో ఎన్ఎస్‌యూఐ సభ్యుడిగా ఉన్న దీపాంశు, ఈసారి స్వతంత్రుడిగా బరిలోకి దిగి విజయం సాధించడం గమనార్హం.ఇదిలా ఉండగా, ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు క్యాంపస్ లోపల గానీ, వెలుపల గానీ ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని ఎన్నికల అధికారులు గెలిచిన అభ్యర్థులకు, వారి మద్దతుదారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

వైసీపీ హయాంలో లడ్డూ కల్తీ వార్తలను ఖండించిన రోజా

భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దని వ్యాఖ్య

సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీపై సాగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. స్వామివారి ప్రసాదాలు అత్యంత పవిత్రమైనవని... కేవలం రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతో కోట్లమంది భక్తుల నమ్మకాలతో, భావోద్వేగాలతో ఆడుకోవడాన్ని కూటమి నేతలు తక్షణమే కట్టిపెట్టాలని డిమాండ్ చేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ నిజమేంటో స్పష్టంగా బయటపడిందని పేర్కొన్న రోజా... జగన్ హయాంలో కల్తీ జరిగిందంటూ వైసీపీపై చేస్తున్న విషప్రచారానికి స్వస్తి పలకాలన్నారు. జగన్ పాలన పచ్చిపాలు లాంటిదని, అక్కడ కల్తీకి ఎంతమాత్రం ఆస్కారం లేదని అన్నారు. నాణ్యతా ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్న నెయ్యి ట్యాంకర్లను టీటీడీ బోర్డు తనిఖీల్లోనే తిరస్కరించి వెనక్కి పంపినప్పుడు, ఆ నెయ్యి ప్రసాదాల్లో కలవలేదని స్పష్టమవుతున్నా, జంతువుల కొవ్వు కలిసిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు అసత్య ప్రచారం చేయడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరచడమేనని రోజా తన పోస్ట్‌లో నిలదీశారు.

స్వచ్ఛతలో మార్పునకు ప్రజలే కీలకం.

జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ.సిరి, ఐఏయస్.

బల్క్ వేస్ట్ జనరేటర్స్ ప్రాసెసింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి.

నెల రోజులపాటు జిల్లాలో స్వచ్ఛత కార్యక్రమాలు.

జివిపిలను గుర్తించి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం.

కర్నూలు, సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)

జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి అధికార యంత్రాంగం వినూత్న ఆలోచనలతో శాయశక్తులా పనిచేస్తోందని, మరింత మెరుగ్గా మార్పునకు ప్రజల సహకారం కీలకమని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ.సిరి, ఐఏయస్ పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛత హీ సేవ, స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా కెసి కెనాల్ వినాయక ఘాట్ వద్ద కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్డీవో సందీప్ కుమార్‌లతో కలిసి స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అధికారులు, సిబ్బందిచే స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మన నగరాన్ని పరిశుభ్రంగా, అందంగా ఉంచడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, తడిపొడి చెత్తను వేర్వేరుగా అందిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలన్నారు. ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే స్వచ్ఛతలో శాశ్వతమైన మార్పు సాధ్యమవుతుందన్నారు. మన నగరం కోసం.. మన ఆరోగ్యం కోసం.. స్వచ్ఛతను మన బాధ్యతగా తీసుకుందామని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ తరహాలో స్వచ్ఛ భారత్ మిషన్ స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని ప్రతి ఏటా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు చేపడుతుందన్నారు.



బల్క్ వేస్ట్ జనరేటర్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించామని, వారు వెంటనే ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే భారత ఉన్నత న్యాయస్థానం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడబడితే అక్కడ చెత్త వేయడం ద్వారా చివరికి చెత్త ఎక్కడికి వెళ్తుందో ఆలోచించాలని, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

గార్లేయపురం డంప్‌యార్డులో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌లను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అధికార యంత్రాంగం తరపున పూర్తిస్థాయి ప్రయత్నాలు చేస్తున్నామని, ప్రజలు సైతం తమ వంతు సహకారం అందించాలని సూచించారు. మన ఊరు బాగుంటేనే మనకు పేరు అనేది ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని, స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. విద్యా దశ నుంచే స్వచ్ఛతకు అలవాటు చేయాలన్నదే తమ ఉద్దేశమన్నారు. త్రిబుల్ ఆర్ సెంటర్ల వినియోగం, వ్యర్థాల వేరు చేయడం, పునర్వినియోగం వంటి అంశాలను విద్యార్థులకు నేర్పిస్తున్నామన్నారు.

కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా నగరంలో నెల రోజులపాటు వివిధ స్వచ్ఛత కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, విద్యార్థులు, యువత, స్వచ్ఛత కార్మికులు, స్వయం సహాయక సంఘాలు, వివిధ సంస్థలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంచడంతో పాటు, ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడమే కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు.నగరంలోని చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను దశలవారీగా తొలగించి పరిశుభ్రమైన ప్రాంతాలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించడం, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చూడటం, త్రిబుల్ ఆర్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, స్వచ్ఛత అనేది కేవలం పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కమిషనర్ సూచించారు. పరిశుభ్రమైన నగరం కోసం ప్రజలు తమ ఇళ్ల నుంచే మార్పును ప్రారంభించాలని, చెత్తను సరైన విధానంలో అందిస్తూ నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే కర్నూలు నగరాన్ని మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దగలమన్నారు.

కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, సానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, ఇంస్పెక్టర్లు ఫరుక్, జిలాని, స్వచ్ఛ సర్వేక్షన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

కర్నూలు వినాయక ఘాట్‌పై లోకేష్ ప్రశంసలు.

వినాయక ఘాట్ రూపాంతరంపై ప్రశంస -మంత్రి టీజీ భరత్, కలెక్టర్, కమిషనర్ కృషికి అభినందనలు

అధికార యంత్రాంగాన్ని అభినందించిన లోకేష్

కర్నూలు, సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)

కర్నూలు నగరంలోని వినాయక ఘాట్ అభివృద్ధి, రూపాంతరంపై రాష్ట్ర సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, మానవ వనరుల అభివృద్ధి (విద్య), రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. నగరంలోని వినాయక ఘాట్ వద్ద గత నాలుగు నెలలుగా చేపట్టిన పారిశుద్ధ్య, అభివృద్ధి పనులకు సంబంధించిన వీడియోను కర్నూలు నగరపాలక సంస్థ ప్రత్యేకంగా రూపొందించి శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. ఈ వీడియోను శనివారం మంత్రి నారా లోకేష్ ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వేదికల్లో రీ-అప్‌లోడ్ చేసి, మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, కమిషనర్ చల్లా ఓబులేసుతో పాటు అధికార యంత్రాంగాన్ని అభినందించారు.

చెత్తతో నిండిన ప్రాంతం నుంచి పరిశుభ్రమైన, అందమైన, అభివృద్ధి చెందిన వినాయక ఘాట్‌గా మారడం అభినందనీయమని మంత్రి నారా లోకేష్ కొనియాడారు. కేంద్రీకృత పాలన, ప్రాథమిక అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే ఎలాంటి మార్పు సాధ్యమవుతుందో కర్నూలు వినాయక ఘాట్ రూపాంతరం



చూపిస్తోందన్నారు. ఈ మార్పు కోసం కృషి చేసిన రాష్ట్ర మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో పాటు మొత్తం అధికార యంత్రాంగానికి అభినందనలు తెలిపారు.

రాజకీయ నాయకత్వం స్థానిక పరిపాలనా యంత్రాంగంతో కలిసి పనిచేస్తే అద్భుతమైన మార్పులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. పరిశుభ్రంగా మారిన ప్రజా ప్రదేశాలను ఇకపై కూడా పరిశుభ్రంగానే ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఈ అందమైన మార్పును కాపాడుకోవడంలో ప్రజలు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. కాగా, నాలుగు నెలల క్రితం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన చల్లా ఓబులేసు తొలుత జేసీబీలతో పెద్ద ఎత్తున చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. అనంతరం ఘాట్ వద్ద సీసీ రహదారి, మెట్లు, బండ్, డ్రెయిన్, రాతి నిర్మాణాలు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు.

కేసీ కెనాల్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క మొక్కలను తొలగింపజేయడంతో పాటు



ఘాట్ పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించారు. కెనాల్‌లో చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, చెత్త సేకరణ ట్రాలీలను అందుబాటులో ఉంచారు. దీంతో గతంలో చెత్తాచెదారంతో నిండిపోయిన ప్రాంతం ప్రస్తుతం పరిశుభ్రంగా, సుందరంగా రూపాంతరం చెందింది. ఈ మార్పులకు సంబంధించిన ప్రత్యేక వీడియోను కర్నూలు నగరపాలక సంస్థ రూపొందించి శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయగా, శనివారం మంత్రి నారా లోకేష్ ఆ వీడియోను తన సామాజిక మాధ్యమ ఖాతాల్లో రీ-అప్‌లోడ్ చేసి అభినందించడం విశేషం.

బీడీలు చుట్టే మహిళా కార్మికురాళ్లకు కొత్తగా పింఛన్ ఇవ్వరా

ప్రశ్నించిన బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి జీవన్ రెడ్డి

రాయికల్ మండలం సెప్టెంబర్19(రిపబ్లిక్ న్యూస్)

రాష్ట్రములో దోపిడి ప్రభుత్వం నడుస్తుందని అన్ని అబద్ధాలేనని ఎంతో కష్టపడుతూన్నా బీడీ కార్మికులకు పింఛన్లు కొత్త వారికి ఇవ్వడం లేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని మాజీ మంత్రి బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ జీవన్ రెడ్డి ఆరోపించారు జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో ఇటిక్యాల రోడ్ లో గల గౌడ సంఘం ఎదురుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహశీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా జీవన్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడాడు ప్రజలకు ప్రభుత్వం జవాబుదారీ కావాలి కానీ అన్ని అబద్ధాలు చెప్పడం ప్రతి మహిళకు 2500 ఫీశీచన్ ఇస్తానని ఇంతవరకు ఇవ్వలేదని ఇలాంటి అబద్ధాలు అడుతు ప్రభుత్వ కొనసాగుతున్నారని ఆరోపించారు

తెలంగాణ తెచ్చింది!! కెసిఆర్ పరిపాలనలో ఎంతో సంతోషంగా ప్రజలు ఉన్నారని రైతులకు రైతు భరోసా



15000 ఇస్తానని ఇంతవరకు కేవలం 12000 మాత్రమే ఇస్తున్నాడని సి కూడా అది కూడా రైతులకు రెండు రెండుసార్లు రైతు భరోసా ఇవ్వలేదని అరోపించారు

ఈ సందర్భంగా రాయికల్ గౌడ సంఘ అధ్యక్షులు ఎలగందుల శ్రీనివాస్ మాజీ మంత్రి జీవన్ రెడ్డికి అలాగే జగిత్యాల జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత సురేష్ మునిసిపల్ వైస్ చైర్మన్ తురగా సౌజన్య శ్రీధర్ రెడ్డి లకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన శ్రీనివాస్ అలాగే విగ్రహధాత వేముల ప్రభాకర్ జీవన్ రెడ్డి, దావ వసంత సురేష్, తురగా సౌజన్య శ్రీధర్ రెడ్డిలకు



సాల్వతో సత్కరించారు ఈ సందర్భంగా వేముల ప్రభాకర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని నా భార్య చంద్రభాగా జ్ఞాపకార్థం పెట్టడం జరిగిందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు మునిసిపల్ చైర్మన్ కట్కామ్ రవీందర్,వైస్ చైర్మన్ తురగా సౌజన్య శ్రీధర్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు అనిల్ కుమార్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్ మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ మహేష్ గౌడ్ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

రాయికల్ పట్టణ ప్రజలకు లో-వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం!!

రూ.30 లక్షలతో నాలుగు డీటీఆర్‌ల ఏర్పాటు







రాయికల్ మండలం సెప్టెంబర్,19(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న లో-వోల్టేజీ సమస్య పరిష్కారానికి రూ.30 లక్షల వ్యయంతో నాలుగు డీటీఆర్‌లు (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు) ఏర్పాటు చేయడం జరిగిందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు.

రాయికల్ మండలంలో గృహజ్యోతి పథకం అమలుకు సుమారు రూ.11.70 కోట్ల వరకు నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ కోసం అవసరమైన డీడీ చెల్లించిన వారికి విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

విద్యుత్ డిమాండ్ పెరిగినా సరఫరాకు చర్యలు

ఈ వర్షాకాలంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని, రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పీక్ స్థాయికి చేరినప్పటికీ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు అవసరమైన విద్యుత్ అందించేందుకు 14 రూపాయలకు యూనిట్ చొప్పున ప్రభుత్వం విద్యుత్‌ను కొనుగోలు చేస్తోందని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఉచిత విద్యుత్‌తో పాటు రుణమాఫీ, రైతుభరోసా తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఆర్థికంగా ఎంతో ప్రయోజనం కలుగుతోందన్నారు. 2026 సెప్టెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, మహిళల ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ.12,385 కోట్ల మేర ప్రయాణ ఖర్చు ఆదా అయిందని తెలిపింది అన్నారు.

రాయికల్ పట్టణ, మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మైతాపూర్‌రామాజీపేట బ్రిడ్జి పనులు పూర్తి చేశామని, మిగిలిన అప్రోచ్ రోడ్డు పనులను కూడా పూర్తి చేస్తామని చెప్పారు.గతంలో సీనియర్ నాయకులు రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో పూర్తి కాలేని బ్రిడ్జి పనులను పూర్తి చేస్తామని అన్నారు .

బోర్నపల్లి బ్రిడ్జికి నిధులు తానే కేటాయించానని చెప్పుకునే సీనియర్ నాయకులు బోర్నపల్లిరేచపల్లితాట్లవాయి ప్రాంతాలకు సంబంధించిన ఫారెస్ట్ క్లియరెన్స్ ఎందుకు ఇప్పించలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

గతంలో మంజూరైన అభివృద్ధి పనులను పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు ఇప్పించేలా చర్యలు తీసుకుంటున్నామని, దీంతో కొత్త అభివృద్ధి పనులను కూడా ప్రారంభించేందుకు అవకాశం ఏర్పడుతోందన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా రాయికల్ పట్టణ, మండల అభివృద్ధి మాత్రం ఆగదని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ రాయికల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు.

రాజకీయాలు ఎన్నికల వరకే అని అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని అన్నారు.

మల్లాపూర్‌లో జర్నలిస్టుపై అధికార పార్టీనాయకుడి అసభ్యపదజాలం

-మాజీ ఎంపీపీపై చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే(హెచ్-143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంగోపాల్ డిమాండ్.

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట అందోళన, వినతిపత్రం అందజేత





మల్లాపూర్ సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) మల్లాపూర్ మండల సీనియర్ జర్నలిస్ట్ రుద్ర రాంప్రసాద్ ను అసభ్య పదజాలంతో దూషించిన అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నల్ల రాజన్నను పార్టీ నుండి సస్పెండ్ చేసి చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (హెచ్-143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుల రాంగోపాల్ అన్నారు. శనివారం యూనియన్లకు అతీతంగా జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలను ధరించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులపై అధికార పార్టీ నాయకుడు అహంకారంతో ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదని, ఆయన చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని జర్నలిస్టులకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సదరు నేతను వెంటనే కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని, లేకుంటే జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్యతో ఫోన్లో మాట్లాడి జరిగిన సంఘటనపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాంచందర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శికారి రామకృష్ణ, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు అంజుగౌడ్, కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు అలాల శంకర్, షౌకత్ అలీ, జిల్లా ఉపాధ్యక్షుడు కనుక సంజీవ్, ఐజేయూ ఈసీ సభ్యుడు చింతలూరి రంజిత్, జర్నలిస్టులు సుతారి కృష్ణమాచారి, తోకల పవన్, ముత్యాల రమేష్, మోర సతీష్, నూనె అంజనేయులు, పెంబి మహేష్, ఆదరి రాజేందర్, రమేష్ నాయక్, శేఖర్, శ్రీనివాస్, మల్లేష్, వెంకటేష్, సుధాకర్, మహేష్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ వడ్డెర కాలనీలో విగ్నేశ్వర స్వామి మంటపం వద్ద సామూహిక కుంకుమార్చన ప్రత్యేక పూజలు అన్నప్రసాదం



రాయికల్ మండలం సెప్టెంబర్,19(రిపబ్లిక్ న్యూస్)



జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని ఇటిక్యాల రోడ్ ఒడ్డెర కాలనీలో నెలకొల్పిన శ్రీ విఘ్నేశ్వర స్వామి మంటపం వద్ద శనివారం మహిళలు సామూహిక కుంకుమార్చన ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. స్త్రీ సౌభాగ్యాల చిహ్నం కుంకుమ అని హిందూ ధర్మం లో కుంకుమ ధరించడం వల్ల దృష్టి దోషాలు తొలగిపోయి సుఖసంతోషాలు చేకూరుతాయని పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ వివరించారుఈ కార్యక్రమంలో నిర్వాహకులు అల్లెపు రవి,ఆలకుంట భీమయ్య,చెల్ల చంద్రయ్య బోదాసు శంకర్,సూర రాజు మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

రాయికల్ అశోక్ నగర్లో వినాయకుడి దగ్గర అన్నప్రసాదం పెద్ద ఎత్తున ప్రజలు హాజరు

రాయికల్ మండలం సెప్టెంబర్,19 (రిపబ్లిక్ న్యూస్)





జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో రెండో వార్డ్ అశోక్ నగర్ లో గణేశుని విగ్రహం వద్ద అన్నప్రసాదశీ కు భారీ ఎత్తున ప్రజలు చేరుకున్నారు మొదలు వినాయకుని పూజలు చేసి అన్నా ప్రసాదాన్ని ఆరగించారు ఈ కార్యక్రమం ఆనందోత్సవాల మధ్య జరిగిందని నిర్వాహకులు చిలువేరి సురేష్ తెలిపారు

ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం





రాయికల్ మండలం సెప్టెంబర్19(రిపబ్లిక్ న్యూస్) జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన పెనుగొండ గాయత్రి, సాంబార్ మణికంఠలను రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ వాసం ప్రసాద్ మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు కష్టపడి ఉన్నత విద్యలో రాణించడం అభినందనీయమని అన్నారు. ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించడం విద్యార్థుల పట్టుదల, కృషికి నిదర్శనమని, భవిష్యత్తులో మంచి వైద్యులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో సెక్రటరీ కనపర్తి శ్రీనివాస్ ట్రెజరర్, మురళి గౌడ్, బత్తిని భూమయ్య, మ్యకల రమేష్, మచ్చ శేఖర్, ఆడెపు రాంప్రసాద్, సామల సత్యనారాయణ, వాసం స్వామి, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్ సాంబారూ శ్రీనివాస్ గంగాధర్, సంకోజి అశోక్, పులి రమేష్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన సర్పంచ్



మల్లాపూర్ సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)ఈరోజు రేగుంట గ్రామంలో ఈజీఎస్ నిధులు మూడు లక్షల రూపాయలతో డ్రైనేజీ పనులను ప్రారంభించిన రేగుంట సర్పంచ్ తీట్ల లహరి రాజేష్. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణానికి నిధులను అందించిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

రాయికల్ సీనియర్ పాత్రికేయులు సయ్యద్ రసూల్ను ఘనంగా సన్మానించిన ప్రముఖ రచయిత వేముల ప్రభాకర్ గౌడ్

రాయికల్ మండలం సెప్టెంబర్19(రిపబ్లిక్ న్యూస్)



జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు సయ్యద్ రసూల్ ను ప్రముఖ రచయిత వేముల ప్రభాకర్ గౌడ్ ఘనంగా సన్మానించారు రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సహకారసంఘాల సబ్ రిజిస్ట్రార్ గా పదవీ విరమణ పొందిన రచయిత ప్రభాకర్ గౌడ్ తాను విద్యనభ్యసించిన పాఠశాలను చూడడానికి వచ్చిన సందర్భంలో పాఠశాల లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు కై నిధులు విరాళంగా అందజేస్తానని ప్రకటించారు. పాఠశాల పూర్వ విద్యార్థి పత్రిక విలేఖరి గా రాణిస్తున్న సయ్యద్ రసూల్ ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్ ఉపాధ్యాయులు పి.రాజశేఖర్ చెరుకు మహేశ్వర శర్మ పి రమేష్ జి తరంగిణి ఎం రమ పి సృజన సిఆర్పి కె.రవీందర్ జూనియర్ అసిస్టెంట్ శాంతయ్య తదితరులు పాల్గొన్నారు

రాయికల్లో త్రిశూల్ మహిళా సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని వద్ద పూజలు చేసిన తాసిల్దార్ నాగార్జున

రాయికల్ మండలం సెప్టెంబర్,19(రిపబ్లిక్ న్యూస్)





జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని నందు త్రిశూల్ మహిళా మణుల ఆధ్వర్యంలో ఈరోజువినాయకుని వద్ద అన్న ప్రసాద కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా రాయికల్ ఎమ్మార్వో నాగర్జున హాజరై వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు

ఈ కార్యక్రమంలో డిటి అరుణ్ . అటవీశాఖ అధికారి డిప్టియర్. పద్మ. సెక్షన్ ఆఫీసర్ రత్నమాల. బీట్ ఆఫీసర్ రమణారెడ్డి. మున్సిపల్ చైర్మన్ కట్కామ్ రవీందర్. తురగా శ్రీధర్రెడ్డి . రాకేష్ నాయక్. అనిల్. రావులకారి సతీష్. ఇంద్రాల లక్ష్మణ్ కంచర రాజేశం సిలివేరి సురేష్. చందనగిరి ఆంజనేయులు. గోవిందుల రమణ. ఇందూరు వేణు. లక్ష్మీ పద్మ. తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

త్రైమాసిక తనిఖీలో భాగంగా ఈవీఎం గోదాములను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల భద్రతా ఏర్పాట్ల తనిఖీ





నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)త్రైమాసిక తనిఖీలో భాగంగా నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డులో ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శనివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల భద్రతా ఏర్పాట్లు, సీల్‌లు, రక్షణ చర్యలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్న తీరును ఆమె తనిఖీ చేశారు. గోదాముల పరిసరాల్లో చేపడుతున్న భద్రతా చర్యలను కూడా పరిశీలించి, ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో డిఆర్ఓ రాము నాయక్, ఆర్డిఓ విశ్వనాథ్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున సయ్యద్ రియాజ్ భాష, తెలుగుదేశం పార్టీ తరపున శివరామిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున సాయిరాం రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ తరపున ప్రదీప్, సీపీఐ తరపున నరసింహులు తదితర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

పింఛన్ల అర్హతలపై ఆరు దశల ధ్రువీకరణ పక్కాగా చేపట్టాలి

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు: కలెక్టర్ జి. రాజకుమారి



నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)
పింఛన్ల మంజూరులో ప్రభుత్వం నిర్దేశించిన ఆరు దశల ధ్రువీకరణ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పింఛన్ల అర్హతలు, దరఖాస్తుల పరిశీలనపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ లబ్ధిదారుల ఎంపికలో కుటుంబాన్ని ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వం నిర్దేశించిన ఆరు అర్హత ప్రమాణాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉండటం, నెలకు సగటున 300 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగం ఉండటం, నిర్ణీత పరిమితికి మించి వ్యవసాయ భూమి కలిగి ఉండటం, పట్టణ ప్రాంతాల్లో 1,000 చదరపు అడుగులకు మించి ఆస్తి కలిగి ఉండటం, కుటుంబంలో ఆదాయ పన్ను చెల్లించేవారు ఉండటం, నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండటం వంటి అంశాలను జాగ్రత్తగా పరిశీలించి అర్హతను నిర్ధారించాలన్నారు. మాగాణి భూమి మూడు ఎకరాలలోపు, మెట్ట భూమి పది ఎకరాలలోపు ఉండేలా భూ పరిమితులను పరిశీలించాలని, మాగాణి, మెట్ట భూములు కలిపి పది ఎకరాలకు మించకుండా ఉన్నాయా లేదా అనే అంశాన్ని కూడా ధ్రువీకరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం వేర్వేరు రైస్ కార్డులు ఉన్నాయనే కారణంతో ప్రత్యేక కుటుంబంగా పరిగణించి పింఛన్ మంజూరు చేయరాదని, హౌస్‌హోల్డ్ ఆధారంగా అర్హతను పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు. డప్పు కళాకారులు, చర్మకారులు, చేనేత కార్మికుల పింఛన్ దరఖాస్తులను ప్రభుత్వం నిర్దేశించిన వయోపరిమితి, ధ్రువీకరణ పత్రాల ఆధారంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సకాలంలో క్లియర్ చేసి, పింఛన్ల పోర్టల్‌లో డేటా అప్‌లోడ్‌కు ముందే వివరాలు, పత్రాలు, అర్హతలను పూర్తిస్థాయిలో ధ్రువీకరించాలన్నారు. ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించిన పింఛన్ లబ్ధిదారుల వివరాలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ధ్రువీకరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తహశీల్దార్లు, ఎంపీడీఓలు, సాంఘిక సంక్షేమం, చేనేత, మత్స్య, మైనారిటీ సంక్షేమం తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పింఛన్ అందేలా, అనర్హులకు మంజూరు కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

జలధార-జలహారతి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

ఎల్‌నినో ప్రభావంతో ఉపాధి శ్రామికులకు విస్తృతంగా పనులు కల్పించాలి




నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)
జిల్లాలో జలధార-జలహారతి పథకం కింద చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు, ఎల్‌నినో ప్రభావంతో ఉపాధి హామీ శ్రామికులకు విస్తృతంగా పనులు కల్పించి వేజ్ కాంపోనెంట్‌ను పెంచేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీఓలను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జలధార-జలహారతి పథకం కింద జిల్లాలో గుర్తించిన 1,084 పనుల్లో 1,005 పనులకు ఇప్పటికే మంజూరులు జారీ చేశామని తెలిపారు. ఇప్పటివరకు జియోట్యాగింగ్ ద్వారా 337 పనులు పూర్తయ్యాయని, మిగిలిన 688 పనులను కూడా వేగవంతంగా పూర్తి చేసి లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పీబీజీ రాంజీ పథకం కింద ఉపాధి శ్రామికులకు పెద్దఎత్తున పనులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. లేబర్ మొబిలైజేషన్‌ను పెంచి, శ్రామికులకు ఎక్కువ పని దినాలు కల్పించడం ద్వారా వేజ్ కాంపోనెంట్‌ను పెంచేలా చర్యలు తీసుకోవాలని, మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పోర్టల్, యాప్‌లలో సకాలంలో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 46,700కు పైగా బయోమెట్రిక్ ఆధార్ అప్‌డేషన్ కేసులను 100 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న 83 కిట్లను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, నాలుగు వారాల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

అక్టోబర్ 9 నాటికి సర్ తుది ఓటర్ల జాబితా ప్రచురణకు పకడ్బందీ చర్యలు

పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు, ఫామ్‌లను వేగంగా పరిష్కరిస్తున్నాం

80,283 నోటీసులపై విచారణ ప్రక్రియ పూర్తి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)
ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్)లో విచారణలు, ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసి, పెండింగ్ క్లెయిమ్‌లు, ఫామ్‌లను వేగంగా పరిష్కరిస్తూ అక్టోబర్ 9 నాటికి తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సర్ ప్రక్రియ పురోగతిపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్, రాజకీయ పార్టీల తరపున ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి సయ్యద్ రియాజ్ భాష, టిడిపి నుంచి శివరామిరెడ్డి, వైయస్సార్సీపి నుంచి సాయిరాం రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ప్రదీప్, సిపిఐ నుంచి నరసింహులు, బీఎస్పీ పార్టీ ప్రతినిధి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డ్రాఫ్ట్ పబ్లికేషన్ జూలై 31న నిర్వహించగా, ముందుగా నిర్ణయించిన ఆగస్టు 3వ తేదీకి బదులుగా తుది ప్రచురణ తేదీని భారత ఎన్నికల సంఘం అక్టోబర్ 9వ తేదీ వరకు పొడిగించిందన్నారు. ఈ అదనపు వ్యవధిని సద్వినియోగం చేసుకుని ఓటర్ల వివరాల పరిశీలన, అభ్యంతరాలు, విచారణలు, క్లెయిమ్‌ల పరిష్కారం తదితర ప్రక్రియలను పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్ ప్రక్రియలో భాగంగా దాదాపు 6 లక్షల మంది ఓటర్ల డేటా మ్యాపింగ్ పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన డేటాలో పేర్లలో వ్యత్యాసాలు, పుట్టిన తేదీల్లో తేడాలు, తల్లిదండ్రులు-పిల్లల మధ్య వయస్సు వ్యత్యాసం, కుటుంబ సభ్యుల వివరాల్లో అసాధారణతలు తదితర 9 రకాల అనామలీలను గుర్తించామన్నారు. వీటికి సంబంధించి మొత్తం 80,283 నోటీసులు జారీ చేసి విచారణలు పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

88 శాతం డేటా ఫైనల్ పబ్లికేషన్‌కు సిద్ధం

జిల్లాలో మొత్తం 12,25,937 మంది అర్హులైన ఓటర్లకు సంబంధించిన డేటాలో 11,45,665 మంది వివరాలను, అంటే సుమారు 88 శాతం డేటాను ఫైనల్ పబ్లికేషన్‌కు సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. మిగిలిన సుమారు 12 శాతం డేటాను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రతిరోజూ టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విచారణలు పూర్తయిన నేపథ్యంలో ఇకపై ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8 దరఖాస్తులు, క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.

ఫోటో వెరిఫికేషన్ వేగవంతం చేస్తున్నాం

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్యూమరేషన్ ఫామ్‌లలో అప్‌లోడ్ చేసిన ఓటర్ల ఫోటోలు స్పష్టంగా, సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశంపై పునఃపరిశీలన కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. సుమారు 12 లక్షల ఫోటోల్లో 10 లక్షల ఫోటోల పరిశీలన పూర్తయిందని, మిగిలిన సుమారు 12 శాతం ఫోటో వెరిఫికేషన్‌ను ఈ వారంలోనే పూర్తి చేయాలని ఈఆర్వోలు, సంబంధిత అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. సర్ ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలకు ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను నిబంధనల ప్రకారం పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని కలెక్టర్ వివరించారు.

మారుమూల ఇంటి వద్దకే చెత్త బండి

అనంతపురం నగరంలో ఈ-ఆటోల సేవలు ప్రారంభం - ప్రజలు సహకరిస్తేనే స్వచ్ఛ అనంత సాధ్యం - ఎమ్మెల్యే దగ్గుపాటి





అనంతపురం సంక్షేమం, సెప్టెంబరు 19 (రిపబ్లిక్ న్యూస్):
నగరంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఇళ్ల వద్దకూ చెత్త సేకరణ వాహనాలు చేరేలా చర్యలు చేపడుతున్నట్లు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరపాలక సంస్థకు ప్రభుత్వం కేటాయించిన ఈ-ఆటోలను శనివారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. తొలి విడతగా వచ్చిన 15 వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మొత్తం 62 ఈ-వాహనాలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.
చిన్న చిన్న సందుల్లోకూ వెళ్లి చెత్త సేకరించేలా ఈ-వాహనాలను రూపొందించారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి డివిజన్‌కు ఒక వాహనం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వేయకుండా వాహనాలకు అందజేస్తే స్వచ్ఛ అనంత సాధ్యమవుతుందని చెప్పారు.

పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా నిర్వహిస్తాం

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో భారీగా చెత్తను పేరుకుపోయేలా చేసిందని దగ్గుపాటి విమర్శించారు. గత అక్టోబరు 2 నుంచి చెత్త నిల్వలను తొలగించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అనంతపురం డంపింగ్ యార్డులో సుమారు మూడు లక్షల టన్నుల చెత్త ఉండగా.. ఇప్పటి వరకు రెండు లక్షల టన్నుల మేర తొలగించినట్లు చెప్పారు.డంపింగ్ యార్డు వద్ద రూ.15 కోట్లతో ఫ్రెష్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా శుద్ధి చేసి ఎరువుగా, సిమెంట్ పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా నిర్వహిస్తామని తెలిపారు. అదే ప్రాంతంలో అందమైన పార్కును ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు.
రాష్ట్రంలో గతంలో దెబ్బతిన్న వ్యవస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబు తిరిగి గాడిలో పెడుతున్నారని దగ్గుపాటి పేర్కొన్నారు. రాయలసీమను "రైజింగ్ రాయలసీమ"గా అభివృద్ధి చేసేందుకు పరిశ్రమలను తీసుకొస్తున్నామని, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు.

ఈ-వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చాం

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్ వేదికగా నిలుస్తోందన్నారు. కాలుష్యరహితంగా చెత్త సేకరణ చేపట్టేందుకు ఈ-వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. మారుమూల ప్రాంతాలకు సైతం ఇవి చేరుకుని చెత్తను సేకరిస్తాయని తెలిపారు. స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి వారం వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో అనంతపురం స్వచ్ఛమైన, సుందరమైన నగరంగా మారుతోందన్నారు.కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ కుమార్, ఎంహెచ్ఓ రాజా రవీంద్ర చౌదరి, కార్పొరేషన్ డైరెక్టర్లు భవాని రవికుమార్, పి.ఎల్.ఎన్.మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, పోతుల లక్ష్మీనరసింహులు, టీడీపీ నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగించాలి

కార్యాలయాల్లో పరిశుభ్రత, పచ్చదనం, పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత

స్వచ్ఛ అవార్డుల కోసం నామినేట్ చేసిన కార్యాలయాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి - కలెక్టర్ జి. రాజకుమారి



నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్)
స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ ఆవరణలో చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొని పరిసరాలను పరిశీలించారు. కార్యాలయాల ఆవరణలో ఎక్కడా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించకుండా ప్రతిరోజూ పరిశుభ్రతను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్వహణ, పచ్చదనం, మొక్కల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 2 వరకు కొనసాగనున్న నేపథ్యంలో ప్రతి కార్యాలయాన్ని పరిశుభ్రతకు ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయి స్వచ్ఛ అవార్డుల కోసం కలెక్టరేట్, శిశుగృహ (స్పెషల్ అడాప్షన్ ఏజెన్సీ), ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె) నుంచి నాలుగు నామినేషన్లు పంపించినట్లు తెలిపారు. నామినేట్ చేసిన కార్యాలయాల్లో పరిశుభ్రత ప్రమాణాలు, పరిసరాల నిర్వహణ, పచ్చదనం తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి అవార్డులకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సూచించారు. థర్డ్ పార్టీ తనిఖీ బృందాలు సోమవారం నుంచి ఎప్పుడైనా కార్యాలయాలను సందర్శించే అవకాశం ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యాలయ ఆవరణలో ప్లాస్టిక్, చెత్త, వ్యర్థాలు కనిపించిన వెంటనే తొలగించాలని, పరిశుభ్రత లోపాలు పునరావృతం కాకుండా బాధ్యతలను సిబ్బందికి స్పష్టంగా కేటాయించాలని కలెక్టరేట్ ఏఓ ను ఆదేశించారు. కార్యాలయం లోపల, బయట పరిశుభ్రతతో పాటు మరుగుదొడ్ల శుభ్రత, చెత్త నిర్వహణ, మొక్కల సంరక్షణ, పచ్చదనం పెంపునకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం అక్టోబర్ 2తో ముగిసినా, కార్యాలయాల్లో పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి అధికారి, ఉద్యోగి స్వచ్ఛతను తమ బాధ్యతగా స్వీకరించి, ప్రజలకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన కార్యాలయ వాతావరణాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com